ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
5
గురువారం 8 మే 2025



మాక్ డ్రిల్‌లో పాల్గొన్న పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్, వలంటీర్లు

వార్ సైరన్



- జిల్లా వ్యాప్తంగా సివిల్ మాక్ డ్రిల్
- 'ఆపరేషన్ అభ్యాస్' పేరిట అవగాహన
- ఎస్పీ, జేసీ అత్యవసర సమావేశం
- ధైర్యంగా ఉండాలని ప్రజలకు పిలుపు



స్వీయ రక్షణపై ద్విచక్ర వాహనదారుడికి అవగాహన



ఓల్డ్ కంట్రోల్ రూమ్ నుంచి పోలీసులు, వలంటీర్ల మాక్ డ్రిల్ ర్యాలీ

కర్నూలు న్యూసిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు ఒక్కసారిగా తారస్థాయికి చేరాయి. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరిట మెరుపుదాడులతో దాయాది పాకిస్థాన్‌కు గట్టి సమాధానమే ఇచ్చింది. ఈ క్రమంలో భారత్-పాక్ మధ్య యుద్ధ వాతావరణం మొదలైనట్లు కనిపిస్తోంది. ఈ ఉద్రిక్తతలు నెలకొన్న వేళ.. యుద్ధం వస్తే ప్రజలంతా తమప్రాణాలను ఎలా కాపాడుకోవాలనే విషయంలో అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు జిల్లా వ్యాప్తంగా బుధవారం సాయంత్రం సివిల్ మాక్ డ్రిల్ కొనసాగింది. 'ఆపరేషన్ అభ్యాస్' పేరిట చేపట్టిన ఈ మాక్ డ్రిల్ జిల్లా వ్యాప్తంగా సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైంది. శత్రు దేశం పాకిస్థాన్ నుంచి యుద్ధ విమానాలు, క్షిపణులు, డ్రోన్లు దూసుకొస్తున్న వేళ ప్రజల భద్రత కోసం కేంద్రం ఈ మాక్ డ్రిల్‌కు పిలుపునిచ్చింది. ఇందులో అత్యంత కీలకమైనది సైరన్. అధికారులు సైరన్ మోగించి మాక్‌డ్రిల్‌ను ప్రారంభించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సైరన్ మోతలు వినిపించాయి. ఇదిలా ఉండగా కార్గిల్ యుద్ధ సమయంలో ఇలాంటి మాక్‌డ్రిల్ నిర్వహించారు. అది కూడా దేశ సరిహద్దులో ఉన్న జమ్ముకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ వంటి సరిహద్దు రాష్ట్రాల్లోకే పరిమితం అయ్యాయి. కానీ ఇప్పుడు మాత్రం దేశవ్యాప్తంగా యుద్ధ సైరన్ మోగింది.

కర్నూలు నగరంలోని కొండారెడ్డి బురుజు వద్ద సాయంత్రం 4 గంటలకు ప్రయోగాత్మకంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ ద్వారా జారీ చేసి ఎస్ఓపీ(స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) ప్రకారం మాక్ డ్రిల్ నిర్వహించారు. మాక్ డ్రిల్ చేసే ముందు ప్రజలకు భయాందోళనలకు గురికాకుండా వార్ సైరన్ మోగించి సమాచారం అందించారు. సైరన్ మోగిన వెంటనే ప్రజలు సురక్షిత ప్రదేశంలోకి వెళ్లే విధంగా సూచనలు ఇచ్చి చైతన్య పరిచారు. విపత్తులు సంభవించినప్పుడు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు క్షుణ్ణంగా వివరించారు. సంక్షోభ, యుద్ధ సమయంలో పౌరులు తమ ప్రాణాలను ఎలా కాపాడుకోవాలో అన్న అంశంపై అవగాహన కల్పించారు. ఈ మాక్ డ్రిల్‌లో పోలీసులు, రక్షణ శాఖ, ఆర్మీ, విపత్తు నిర్వహణ శాఖ అధికారులతో పాటు జిల్లా అధికార యంత్రాంగం, సివిల్ డిఫెన్స్ వార్డెన్లు, హోంగార్డులు, ఎన్‌సీసీ కోర్, ఎస్ఎస్ఎస్ వలంటీర్లు, ఎస్వైకే సంఘటన్, కళాశాలలు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరపాలక కమిషనర్ మాట్లాడుతూ పాకిస్థాన్‌తో ఉన్న ఉద్రిక్తతల నేపథ్యంలో అత్యవసర పరిస్థితి ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ ప్రాణాలను కాపాడుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలను డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు మేనేజర్ అనుపమ, అర్బన్ తహసీల్దారు వెంకటలక్ష్మి సూచనలు చేశారు. సీఐలు రామయ్యనాయుడు, నాగరాజరావు, మన్సూరుద్దీన్‌లు ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు బందోబస్తు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్‌డీఆర్ఎఫ్ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొండారెడ్డి బురుజు వద్ద మాక్ డ్రిల్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు, పోలీసులు, రెస్క్యూ టీం

కల్తీతో కాసులే!

ప్రస్తుత సమాజంలో ప్రజలు ఎక్కువ శాతం చిరుతిండ్లకు అలవాటు పడ్డారు. ఇదే వ్యాపారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. నాణ్యత లేని, కల్తీ పదార్థాలను వినియోగిస్తున్నారు. వీటిని తిన్న ప్రజలు అనారోగాల బారిన పడుతున్నారు. చిరుతిండ్లు, రెస్టారెంట్లు, బార్లు, హోటళ్లు, తోపుడుబండ్ల వ్యాపారులు, బేకరీలు, స్వీట్స్ దుకాణాల్లో ఎక్కడా చూసినా అపరిశుభ్రత నడుమ తినుబండారాలను తయారుచేస్తున్నారు. కల్తీకి తావులేకుండా ఆహార భద్రత ప్రమాణాల చట్టాన్ని అధికారులు పటిష్టంగా అమలు చేయాల్సి ఉండగా సిబ్బంది కొరతతో ఆశాఖ అధికారులు సతమతమవుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కాస్త అక్రమ వ్యాపారులకు బాగానే కలిసివస్తోందనే విమర్శలు లేకపోలేదు.

- రెచ్చిపోతున్న వ్యాపారులు
- నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు
- అపరిశుభ్రతతో తయారుచేస్తున్న ఆహార పదార్థాలు
- నిబంధనలు పాటించని రెస్టారెంట్లు, హోటళ్లు
- ప్రజల ఆరోగ్యంతో ఆటలు
- తూతూ మంత్రంగా తనిఖీలు





నంద్యాలలోని హోటళ్లలో తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో అనుమతి పొందినవి... కర్నూలు జిల్లాలో...
వివిధ రకాల హోటల్స్ : 255
బేకరీలు, స్వీట్స్‌తయారీ కేంద్రాలు : 244
వివిధ రకాల జనరల్ దుకాణాలు: 888
మొత్తంగా అనుమతి పొందిన లైసెన్సులు : 1389
మూడేళ్లలో నమోదైన కేసులు : 92
మూడేళ్లలో తీసిన శాంపిల్స్: 534
మూడేళ్లలో కలెక్ట్ చేసిన అమౌంట్: రూ. 49.10 లక్షలు

నంద్యాల, మే7(ఆంధ్రజ్యోతి): కల్తీ పదార్థాలతో వ్యాపారులు కాసుల వర్షం కురిపిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెస్టారెంట్లు, బార్లు హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, తదితర తినుబండారాల తయారీ కేంద్రాలలో ఆహార పదార్థాల్లో ఎక్కడా కూడా నాణ్యత కనిపించడం లేదు. నిబంధనలు పాటించకుండా విచ్చలవిడిగా కల్తీ పదార్థాలతో వ్యాపారాలు సాగిస్తున్నారు. ప్రజలు రోగాల బారినపడుతున్నారు. వీటికి తోడు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో కల్తీ మరింత విచ్చలవిడిగా సాగుతోంది. ఆశాఖ అధికారుల తనిఖీలు కూడా అంతంతే ఉండటంతో కల్తీ వ్యాపారులు మరింత రెచ్చిపోతుండటం కలకలం రేపుతోంది. ఇటు ఆహార భద్రత శాఖ, అటు విజిలెన్స్, నగరపాలక, మున్సిపల్ అధికారులు సైతం ఆవైపు కన్నెత్తి చూడకపోవడం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో రోజురోజు కల్తీ పదార్థాల తయారీ ఇష్టారాజ్యంగా సాగుతోందనే విమర్శలు లేకపోలేదు.

అపరిశుభత్ర నడుమ..

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసిన కల్తీ పదార్థాలు దర్శనమిస్తున్నాయి. జిల్లాలో చిరుతిండ్లు, రెస్టారెంట్లు, బార్లు, హోటళ్లు, తోపుడు బండ్ల వ్యాపారులు, బేకరీలు, స్వీట్స్ దుకాణా ల్లో ఎక్కడా చూసినా అపరిశుభ్రత నడుమ తినుబండారాలను తయారుచేస్తున్నారు. అధికారులు తనిఖీ చేపడుతున్నా నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారు. కల్తీ వ్యాపారులు యథేచ్ఛగా తమ వ్యాపారాలు కొనసాగిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. రెస్టారెంట్‌లు, హోటళ్లలో రోజుల తరబడి నిల్వ వుంచిన మటన్, చికెన్, చేపల వంటలు ఫ్రీజర్లలో ఉంచి కల్తీకి పాల్పడుతుండటం కలవరం రేపుతోంది. కొన్ని స్వీట్స్ దుకాణాల్లో అయితే మరీ దారుణం. గులాబ్ జామ్‌లు, లడ్డులు, మైసూర్‌పాక్‌లు తదితర స్వీట్స్ కాలం చెల్లినవి కూడా ప్రజలకు విక్రయిస్తుండటం విడ్డూరం.

మిగతా 6లో..



'అల్లూరి' పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం

- కలెక్టర్ రంజిత్ బాషా



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, అధికారులు

కర్నూలు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శమని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. బుధవారం అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్‌హాల్లో జిల్లా టూరిజం శాఖ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వలశక్తి అని, ఆయన జరిపిన పోరాటం స్వా తంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, సీపీవో హిమప్రభాకర్ రాజు, కలెక్టరేట్ ఏవో విజయశ్రీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, జిల్లా టూరిజం అధికారి విజయ, జిల్లా కోఆర్డినేటర్ అధికారి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చేనేతలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి



మాట్లాడుతున్న చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి

కర్నూలు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో చేనేత కార్మికులకు ఐడీ కార్డులు, సొసైటీ ఏర్పాటు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చేనేత కార్మికులు సొసైటీలుగా ఏర్పాటై ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. 2,849 మంది చేనేత కార్మికులకు పించన్లు ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం 3 సొసైటీలు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నాయన్నారు. స్వయం సహాయ సంఘాలలో ఉండే చేనేత మహిళలను క్లస్టర్లుగా ఏర్పాటు చేసి ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరు చేయించి ప్రోత్సహిస్తామన్నారు. స్కిల్ అప్‌గ్రేడేషన్ కింద రూ.1.50లక్షలు, టెక్నికల్ టెక్నాలజీ అప్‌గ్రేడేషన్, డిజైన్ డెవలప్‌మెంట్ తదితర అంశాలకు దాదాపు రూ.10లక్షలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలలో ఉండే చేనేత మహిళలను 30మందిని కలిసి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ, మెప్మా పీడీలను ఆదేశించారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి చేనేతకు 365 రోజులు పని కల్పించాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మిగనూరులో 3వేల నుంచి 4వేల వరకు చేనేత కార్మికులు ఉన్నారని, వారికి ఐడీ కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో జేసీ నవ్య, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, హ్యాండ్లూమ్ ఏడీ నాగరాజరావు, మెప్మా పీడీ నాగశివలీల తదితరులు పాల్గొన్నారు.

ట్రయల్ రన్‌లోనే...


- ప్రయోగాత్మక దశలోనే కూలిన ఓవర్ హెడ్ ట్యాంకు
- త్రుటిలో తప్పిన ప్రమాదం



మంత్రాలయం రాఘవేంద్రపురంలో కూలిన ఓవర్ హెడ్ ట్యాంకు

మంత్రాలయం, మే 7 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్ల శ్రమ, లక్షలాది రూపాయలు వృథా అయ్యాయి. ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు ట్రయల్ రన్‌లోనే బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా కుప్పకూలింది. 2017లో రూ.9.80 కోట్ల నాబార్డు నిధులతో రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు, మైక్రో ఫిల్టర్స్, సంపు పనులను నెల్లూరుకు చెందిన జీపీఆర్ కన్‌స్ట్రక్షన్ చేపట్టింది. ఇందులో భాగంగా పట్టణంలోని రాఘవేంద్రపురం శివారులో దాదాపు రూ.25 లక్షల ఖర్చుతో 60వేల లీటర్ల నీటి సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మించారు. అప్పట్లోనే నాణ్యత సరిగ్గా లేదని టీడీపీ నాయకులు కోర్టును ఆశ్రయించారు. దాంతో కాంట్రాక్టరుకు బిల్లులు మంజూరు కాలేదు. కాంట్రాక్టరు కూడా కోర్టును ఆశ్రయించారు. ఓవర్ హెడ్ ట్యాంక్ వివాదం కోర్టు పరిధిలో ఉంది. జలజీవన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో 15 రోజులుగా సూగూరు ఎస్ఎస్ ట్యాంకు నుంచి ఓవర్ హెడ్ ట్యాంకుకు నీటిని వదులుతూ ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు. ఈ దశలోనే ట్యాంకు ఒక్కసారిగా కూలిపోయి నేలమట్టమైంది. పెద్ద శబ్దం రావడంతో సమీప కాలనీవాసులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. దీని పక్కనే 11కేవీ విద్యుత్ వైర్లు ఉన్నాయి. ఈ ట్యాంకు కింద పైన నిత్యం యువకులు, విద్యార్థులు ఆటాడకుంటూ ఉండేవారు. మధ్యాహ్న సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్దప్రమాదమే తప్పింది. విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, డీఈ మైనుద్దీన్, ఏఈఈ వెంకట్రాముడు, పంచాయతీ సెక్రటరీ ఇస్రత్ బాషా, షాహీన్, వైస్ ఎంపీపీ రాఘవేంద్ర, ఎంపీటీసీలు వెంకటేశ్ శెట్టి, మేకల వెంకటేశ్, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు శివ కృష్ణ, కవిత పరిశీలించారు. ఎనిమిదేళ్లుగా నిరుపయోగంగా ఉండటంతోనే కూలిందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. నిర్మాణం సమయంలో నాణ్యతా ప్రమాణా లు పాటించకపోవడంతోనే కూలిపోయిందని నాయకులు ఆరోపిస్తున్నారు.

విచారణ చేపట్టండి : పవన్ కల్యాణ్



అమరావతి, మే 7 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంక్ కూలిన ఘటనపై విచారణ చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బుధవారం ఆదేశాలిచ్చారు. ట్యాంక్ కూలిన విషయం ఉపముఖ్యమంత్రికి తెలియగానే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కూలిన సమయంలో పరిసరాల్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. ఇలాంటి పరిస్థితులు రాకూడదని, ఈ నిర్మాణం నాణ్యతా ప్రమాణాలపై విచారణ చేసి నివేదిక వెంటనే పంపాలని ఆదేశించారు. బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకుల నాణ్యతను పరిశీలించి సమగ్ర నివేదికను అందించాలని సూచించారు.

అవిశ్వాసం ఏమయ్యేనో?

- నందికొట్కూరులో భిన్న పరిస్థితులు
- రేసులో టీడీపీలోని రెండు వర్గాలు
- సాంకేతికంగా వైసీపీ సభ్యులే కానీ..
- ఎంపీ, ఎమ్మెల్యే వర్గాల్లో కౌన్సిలర్లు
- నేడు నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం

నందికొట్కూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరులో మున్సిపల్ రాజకీయం రసవత్తరంగా మారింది. భిన్న రాజకీయాలతో ప్రస్తుతం పట్టణ రాజకీయం వేడెక్కింది. రాష్ట్రమంతా ఒకలా నందికొట్కూరులో మాత్రం మరోలా మున్సిపల్ అవిశ్వాసం సాగుతోంది. వారం రోజులుగా తీవ్ర ఉత్కంఠతకు దారి తీసిన అవిశ్వాస తీర్మానానికి గురువారం తెరపడనుంది. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డిపై అవిశ్వాస తీర్మానాన్ని కౌన్సిల్‌లో ప్రవేశపెడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రత్యేక సమావేశానికి స్పెషల్ ఆఫీసర్‌గా ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానానికి సంబంధించి భారీ భద్రత, బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిబంధనల మేరకే అవిశ్వాస తీర్మానం కొనసాగుతుందన్నారు. ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాల్ సమావేశం జరుగుతుందని తెలిపారు. మొత్తం మీద టీడీపీలోని రెండు వర్గాల కారణంగా మిగతా 6లో...

వేరుశనగ గరిష్ఠ ధర రూ.6,396



విక్రయానికి వచ్చిన వేరుశనగ దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగ ధరలు పది రోజులుగా స్థిరంగా ఉన్నాయి. బుధవారం వేరుశనగ ధర క్వింటా గరిష్ఠంగా రూ.6,396 చొప్పున వ్యాపారులు టెండర్ ద్వారా కొనుగోలు చేశారు. బోరు బావుల కింద సాగైన వేరుశనగ దిగుబడులు విక్రయానికి వస్తున్నాయి. ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో వేరుశనగ రైతులు నిరాశ చెందుతున్నారు. 211 బస్తాల వేరుశనగ విక్రయానికి రాగా క్వింటాలు వాటి కనిష్ఠ ధర రూ.3,316, గరిష్ఠంగా రూ.6,396, సగటున రూ.5,619 పలికింది.

సామాన్యుడి సన్నబియ్యం





- క్వింటా రూ.4,400 నుంచి రూ.4,800
- గతేడాదితో పోల్చితే తగ్గిన ధరలు
- ప్రభుత్వం ప్రోత్సాహంతో పెరిగిన దిగుబడి
- మంచి దిగుబడితో రైతుల్లో హర్షం

నంద్యాల ఎడ్యుకేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు కర్నూలు, నంద్యాల సోనా రకాల సన్న బియ్యం ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉండేవి కాదు. అలాంటి పరిస్థితులను రూపు మాపాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సాగును ప్రోత్సహిస్తూ తీసుకున్న పటిష్ట చర్యలతో రైతుల వెన్నంటి నిలిచింది. అటు రైతుకు దిగుబడి పెంచేలా ఊతమిస్తూనే ఇటు వినియోగదారుడికి సోనా రకం బియ్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో కేంద్రప్రభుత్వం దేశ సరిహద్దులు దాటకుండా గీత గీసింది. సప్లై పెరగడంతో డిమాండ్ తగ్గుతుందనే భయంతో మిల్లర్లు సైతం రేట్లు తగ్గించేశారు. డిమాండ్ కంటే ఎక్కువగా బియ్యం మార్కెట్‌కు చేరుకోవడంతో ధరలు అదుపులోకి వచ్చేశాయి. గత ఏడాది క్వింటా నంద్యాల సోనా బియ్యం రూ.6,200 నుంచి రూ.6,800 ధర ఉండేది. కానీ ఈ ఏడాది రూ.4,800 నుంచి రూ.5వేల వరకు విక్రయిస్తున్నారు. అలాగే కర్నూలు సోనా రకం గత ఏడాది రూ.5,800 నుంచి రూ.6వేల వరకు ధర ఉండేది. కానీ ఈ ఏడాది రూ.4,100 నుంచి రూ.4,400 వరకు నాణ్యతను బట్టి విక్రయిస్తున్నారు.



గోదాముల్లో నిల్వచేస్తున్న వడ్ల బస్తాలు

● ప్రభుత్వ ప్రోత్సాహంతో పెరిగిన దిగుబడి



ఉమ్మడి జిల్లాలో వరిసాగుకు తోడు ప్రభుత్వ ప్రోత్సాహం ఉండటంతో ఈ ఏడాది ఖరీఫ్‌లోనూ, రబీలోనూ పంట అధిక దిగుబడి వచ్చింది. అప్పుడప్పుడూ ప్రకృతి కన్నెర్ర చేసినా పెద్దగా నష్టం జరగలేదు. గత ఏడాది ఖరీఫ్ (2023)లో కర్నూలు జిల్లాలో 12,622 హెక్టార్లలో వరి సాగుచేయగా ఈ ఏడాది ఖరీఫ్(2024)లో 13,511 హెక్టార్లలో సాగుచేశారు. అలాగే రబీలో గత ఏడాది(2024) 303 హెక్టార్లలో వరి సాగుచేయగా ఈ ఏడాది(2025) రబీలో 726 హెక్టార్లలో వరి సాగుచేశారు. నంద్యాల జిల్లాలో ఖరీఫ్(2023)లో 47,314 హెక్టార్లలో వరి సాగుచేయగా, ఈ ఏడాది(2024) ఖరీఫ్‌లో 67,896 హెక్టార్లలో సాగుచేశారు. రబీలో గత ఏడాది 937 హెక్టార్లలో వరి సాగుచేయగా ఈ ఏడాది 1,200 హెక్టార్లలో సాగుచేశారు. 78 కిలోల వడ్ల బస్తా ధర రూ.2వేల నుంచి రూ.2,200 వరకు ఉంది. గత ఏడాదికి ఈ ఏడాది వేసిన సాగు విస్తీర్ణంలో భారీ తేడా ఉండడం కూడా ఒక కారణమని వ్యాపారులు భావిస్తున్నారు. మార్కెట్‌లో సన్నబియ్యం విరివిగా లభిస్తుండటంతో ధరలు గణనీయంగా పడిపోయాయి.

● పంట పెరగడం వల్లే ధరలు తగ్గాయి



నంద్యాల, కర్నూలు సోనా పంట సాగు, దిగుబడి పెరగడంతో ఈ ఏడాది ధరలు తగ్గాయి. పెద్ద రైతులు గోదాముల్లో నిల్వలు కూడా చేశారు. మార్కెట్ నిలకడగానే ఉంది. గత ఏడాది రూ.6వేల నుంచి రూ.6,500 వరకు కూడా విక్రయించాం. ఈ ఏడాది క్వింటా రూ.4,400 నుంచి రూ.4,800 వరకు విక్రయిస్తున్నాం.

- మేడా లక్ష్మయ్య, నంద్యాల జిల్లా రైస్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

● మంచి దిగుబడి వచ్చింది



ఈ సంవత్సరం ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ మంచి దిగుబడి వచ్చింది. సకాలంలో ఎరువులు, నీళ్ల అందుబాటులో ఉండడం వల్ల మంచి దిగుబడి రావడానికి సాధ్యమైంది. ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారులు కూడా పంటలను సందర్శించి సలహాలు, సూచనలిచ్చారు. ఎకరాకు పంట 35బస్తాల నుంచి 40 బస్తాలు దిగుబడి వచ్చింది.

- యోగేశ్వర్, రైతు, బిల్లలాపురం

● ధర నిలకడగా ఉంది



ఈ సంవత్సరం వడ్ల ధర నిలకడగా ఉంది. పెట్టుబడి అధికంగా ఉన్నప్పటికీ మంచి దిగుబడులు రావడంతో రైతులు నష్టపోలేదు. రబీలో కొంత ఇబ్బందులు పడినప్పటికీ నీటివిడుదలలో ప్రజాప్రతినిధులు, అధికారులు చూపిన చొరవతో పంటలను కాపాడుకున్నాం.

- నాగన్న, రైతు, పెద్దకొట్టాల

అవిశ్వాసం ఏమయ్యేనో?



మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానానికి సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

(5వ పేజీ తరువాయి)

అవిశ్వాస తీర్మానం సమావేశం జరుగుతుందా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండు వర్గాల్లోని వారు ఎవరికి వారుగా ఉండటంతో సరైన కోరం ఉంటుందా? లేక కొందరు కౌన్సిలర్లు గైర్హాజరవుతారా? అన్నది ఉత్కంఠగా మారింది.

● ఎవరి లెక్కలు వారివే...

29 మంది సభ్యులున్న కౌన్సిల్‌లో వైసీపీకి సాంకేతికంగా 28 మంది సభ్యులు, టీడీపీ నుంచి ఒక సభ్యుడు ఉన్నారు. వీరు కాకుండా నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉన్నారు. వాస్తవానికి గత ఎన్నికల్లో 28 మంది వైసీపీ నుంచి కౌన్సిలర్లుగా గెలిచినప్పటికీ సార్వత్రిక ఎన్నికలకు ముందు, తర్వాత 26 మంది తెలుగుదేశం కండువా కప్పుకున్నారు. వీరిలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డితో పాటు మరో 10మంది కౌన్సిలర్లు ఎంపీ బైరెడ్డి శబరి వర్గంలో ఉన్నారు. మరో ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు కూడా ఆ వర్గానికే మద్దతు పలికారు. ఇక 16 మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య వర్గంలో ఉన్నారు. అవిశ్వాస తీర్మానంలో బలనిరూపణ జరగాలంటే 2/3 వంతు సభ్యులు ఉండాలి. ఈప్రకారం చూస్తే 19 మంది కౌన్సిలర్లు సభకు హాజరు కావాలి. సభకు హాజరైన వారిలో సగం కంటే ఒకరు ఎక్కువ ఉంటే వారిదేపై చేయి అవుతుందని అధికారులు చెబుతున్నారు. కోరం లేకపోతే పరిస్థితిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వారి సలహా మేరకు సభను నిర్వహించాలా? లేక రద్దు చేయాలా? అన్న అన్న విషయంపై స్పెషల్ ఆఫీసర్ నిర్ణయం తీసుకుంటారు. అవిశ్వాసం నెగ్గితే ప్రస్తుతం ఉన్న వైస్ చైర్మన్లలో ఒకరిని తాత్కాలిక చైర్మన్‌గా ప్రకటించి, రెండు నెలల తర్వాత కొత్త చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఒకవేళ అవిశ్వాసం వీగిపోతే ప్రస్తుతం ఉన్న చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి పదవిలో అలాగే కొనసాగుతారు. అదీ కాకుండా ఎంపీ బైరెడ్డి శబరి వర్గంలో ఉన్న 13 మంది గైర్హాజరైతే సరైన కోరం లేక అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ వ్యూహంతో చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి వర్గం సభకు వస్తుందా? రాదా? అన్న చర్చ జోరుగా సాగుతోంది.

● క్యాంపు రాజకీయాలు

మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి తీరుపై అసంతృప్తిగా ఉన్న 16 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసి అవిశ్వాసం కోరుతూ ఏప్రిల్ 15వ తేదీన కలెక్టర్‌కు సమర్పించారు. దీంతో కలెక్టర్ ఆత్మకూరు ఆర్డీవోను ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా నియమించారు. దీంతో ఆమె మే 8వ తేదీన అవిశ్వాస సమావేశానికి నోటీసులు జారీచేశారు. ఈ క్రమంలో వారం రోజులుగా కౌన్సిలర్లను ఎంపీ, ఎమ్మెల్యే వర్గీయులు క్యాంపులకు తరలించారు. ఎంపీ వర్గం కౌన్సిలర్లు ఊటీకి వెళ్లగా, ఎమ్మెల్యే వర్గం కౌన్సిలర్లు హైదరాబాదులో మకాం వేశారు. అయినప్పటికీ ఎవరికి వారుగా కౌన్సిలర్లను తమ వైపు లాక్కునేందుకు ప్రలోభాల పర్వానికి తెరతీశారు. ఈ క్రమంలో వైసీపీ నాయకుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కూడా తమ పార్టీకి చెందిన వారితో పాటు ఎంపీ వర్గంలో ఉన్న కొందరు కౌన్సిలర్లను తమ వద్దకు రప్పించుకొని తప్పకుండా దాసి సుధాకర్‌రెడ్డికే మద్దతు తెలపాలని ఆదేశించినట్లు పట్టణంలో జోరుగా ప్రచారం సాగుతోంది. వారం రోజులుగా క్యాంపు రాజకీయాల్లో ఉన్న కౌన్సిలర్లు గురువారం నేరుగా మున్సిపల్ కార్యాలయంలో జరిగే అవిశ్వాస తీర్మానానికి హాజరు కానున్నారు.



అవార్డు అందుకుంటున్న సహాయ సంక్షేమ శాఖ అధికారి మద్దిలేటి

ఉత్తమ సేవలకు పురస్కారం

కర్నూలు ఎడ్యుకేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో పది, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేసిన సహాయ సంక్షేమ శాఖ అధికారి మద్దిలేటి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కె.ప్రమీలారాణికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామి విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేశారు. కర్నూలు అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ బి.మద్దిలేటి, రాష్ట్ర ఉత్తమ పురస్కారాన్ని, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రమీలా రాణి రాష్ట్ర ఉత్తమ అవార్డును మంత్రి చేతుల మీదుగా అందుకున్నారు. హాస్టల్ విద్యార్థులు పది, ఇంటర్ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినందుకుగానూ ఉత్తమ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ అండ్ సెక్రటరీ లావణ్య, అధికారులు ఉన్నారు.

నేటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ) పరిధిలో ఈనెల 8 నుంచి జూన్ 3 తేదీ వరకు డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకులపతి వి. వెంకట బసరావు ఆదేశాల మేరకు రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండో సెమిస్టర్‌కు రెగ్యులర్ 8103, సప్లమెంటరీలో 7109 మంది, 4వ సెమిస్టర్‌లో రెగ్యులర్‌లో 6707, సప్లమెంటరీకి 6262 మంది, 6వ సెమిస్టర్‌లో సప్లిమెంటరీ 1230 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 55 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై సమీక్ష

కర్నూలు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి): మే 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలపై జేసీ నవ్య బుధవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 76 సెంటర్లలో మొదటి సంవత్సరం 16,292 మంది, రెండో సంవత్సరంలో 5,032 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు, బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌ఐవో గురువయ్యశెట్టి, డీవీఈవో సురేష్‌బాబు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను రూపు మాపుదాం

- జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది
- న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్

కర్నూలు లీగల్, మే 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది అన్నారు. బుధవారం జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను రూపు మాపేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కబర్ది మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని, బాలలు పని ప్రదేశాల్లో గాక పాఠశాలలో విద్యనభ్యసించాలని ఆయన కోరారు. శిశు సంక్షేమ శాఖ, ఐసీడీఎస్ అధికారులు, కార్మిక శాఖ అధికారులతో కూడిన బృందాలు ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో భాగంగా ర్యాలీ స్థానిక పాతబస్టాండు, రాజ్‌విహార్ సెంటర్, పెద్దమార్కెట్, ఆనంద్ థియేటర్, భూపాల్ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో ఉన్న షాపులను, హోటళ్లను తనిఖీచేశారు. ఈ తనిఖీల్లో ఐదు మంది బాలకార్మికులను గుర్తించారు. బాల కార్మికుల తల్లిదండ్రులను పిలిపించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించి ఆ తర్వాత బాలకార్మికులను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే లీగల్ సర్వీసెస్ టోల్‌ఫ్రీ నెంబరు: 15100 లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ సెంటర్ నెంబర్: 1098లకు సమాచారం ఇవ్వాల్సిందిగా ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.లీలా వెంకట శేషాద్రి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సాంబ శివరావు, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ జుబేదా బేగం పాల్గొన్నారు.



స్పెషల్ డ్రైవ్‌ను పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది

కోర్టుల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

● ఉమ్మడి జిల్లాల్లో 100 ఖాళీలు

నంద్యాల క్రైం, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోర్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి రాష్ట్రప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వంద పోస్టులు ఖాళీగా ఉన్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాల్లో స్టెనోగ్రాఫర్ 8, జూనియర్ అసిస్టెంట్ 12, టైపిస్ట్ 11, ఫీల్డ్అసిస్టెంట్ 2, డ్రైవర్స్(లైట్‌వెహికిల్) 3, కాపీయిస్ట్ 7, ప్రాసెస్ సర్వర్ 2, ఆఫీస్ సబార్డినేట్ 55 పోస్టులు ఖాళీలు ఉన్నట్లు ప్రకటించారు. పోస్టుల భర్తీకి మే 13వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, జూన్ 2వ తేదీతో ముగుస్తుందన్నారు. దరఖాస్తు చేసుకునే ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.800, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.400 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

'కల్తీ'తో కాసులే..!

(5వ పేజీ తరువాయి)

ఉమ్మడి జిల్లాలో ఎక్కువశాతం హోటళ్లు, రెస్టారెంట్లలో నిధులను గాలికొదిలేశారు. వంట పాత్రలు శుభ్రం చేసేందుకు ప్రత్యేక గది ఉండాలి. కానీ ఎక్కడా అమలు కావడం లేదు. చాలా వరకు హోటళ్లు, రెస్టారెంట్‌లలో వినియోగించిన పాత్రలు, గ్లాసులను పదే పదే కడిగి తిరిగి వాటిని వాడుతున్నారు. వంటమాస్టర్లు, సర్వర్లు తప్పనిసరిగా ఆప్రాన్స్, క్యాప్, చేతులకు గ్లౌజులు ధరించాల్సి ఉంది. కానీ ఎక్కడా పాటించడంలేదు. కొన్ని సందర్భాల్లో ఆహారంలో వెంట్రుకలు కూడా వస్తుండటం గమనార్హం. కొన్ని రోజుల తరబడి ఫ్రిజ్‌లో నిల్వఉంచి దుర్వాసన వచ్చినా వాటిని నూనెలో ఫ్రైచేసి తమదైన శైలిలో ప్రజలకు అంటగడుతున్నారు. బాగా మరిగినా నూనెను మళ్లీ మళ్లీ వినియోగించరాదని వైద్యులు చెప్తున్నా.. రోజుల తరబడి మరిగినా నూనెను కొందరు నిర్వాహకులు వాడేస్తుండటం గమనార్హం. ప్రధానంగా నంద్యాల, నందిగొట్కూరు, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు, బేతంచెర్ల, బనగానపల్లె, కోయిలకుంట్ల, శ్రీశైలం తదితర ప్రాంతాలు. అదే విధంగా కర్నూలు, కోడుమూరు, వెల్దుర్తి, సి.బెళగల్, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు. మంత్రాలయం ప్రాంతాల్లో ఈ తంతు జోరుగా సాగుతోందని సమాచారం.

కొత్త హంగులతో..

ఇటీవల నంద్యాల, కర్నూలు పట్టణ ప్రాంతాల్లోని జాతీయ రహదా రుల్లో కొత్త హంగులతో హోటల్స్ స్వీట్ హౌస్‌లు, ఫుడ్‌కోర్టులు రకర కాల వ్యాపార సముదాయాలు పెద్దఎత్తున వెలుస్తున్నాయి. చైనీస్, ఇరానీ వంటకాలు కూడా ఊపందుకున్నాయి. ఇదే క్రమంలో నిల్వ వుంచిన ఆహారం విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడు తున్నారు. తినడానికి రాగానే.. టక్కున వేడి చేసి నిమిషాల వ్యవధిలో పాడైపోయిన ఆహార పదార్థాలను ఇచ్చేస్తున్నారు. వీటితో పాటు కోళ్ల వ్యర్థాలు, కళేబరాల నుంచి తయారు చేసిన నూనెను కూడా కొందరు నిర్వాహకులు వినియోగిస్తుండటం కలవరం రేపుతోంది. రెస్టారెంట్‌లు, డాబాల్లో అయితే మరీ దారుణం. తాగిన మత్తులో వచ్చిన వాడికి కల్తీ ఆహారాన్ని అందించి అధిక ధరలతో దోపిడీ చేయడం జిల్లాలో సర్వ సాధారణమైపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆహార భద్రత శాఖను పటిష్ట పరిచి కల్తీ వ్యాపారులపై కొరడా ఝుళిపించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సిబ్బంది కొరత

కల్తీకి తావులేకుండా ఆహార భద్రత ప్రమాణాల చట్టాన్ని అధికారులు పటిష్ఠంగా అమలుచేయాల్సి ఉంది. కర్నూలు డివిజన్-2 అధికారి అనారోగ్యం కారణం ఉండటంతో.. డివిజన్-1 అధికారికి డివిజన్-2 కూడా అదనపు బాధ్యతలు అప్పగించారు. పైగా సిబ్బంది కొరత కూడా ఉండటం.. తద్వారా ఎక్కడా ఆశించిన స్థాయిలో తనిఖీలు చేయడంలేదు. నిబంధనల ప్రకారం ప్రతి 50వేల మందికి ఒక ఆహార తనిఖీ అధికారి ఉండాలి. ఈనేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉండాల్సి ఉండగా.. కేవలం నలుగురు మాత్రమే ఉన్నారు. వీరిలో కూడా ఒకరు అనారోగ్యంతో ఉన్నారు. వీటికి తోడు నగరపాలక సంస్థ, మున్సిపాలిటీల, విజిలెన్సు అధికారులు తనిఖీలు చేయాల్సి ఉండగా వీరందరూ కూడా ఆవైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే ఆరోపణలు లేకపోలేదు. అధికారుల నిర్లక్ష్యం కాస్త ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విచ్చలవిడిగా కల్తీ వ్యాపారంతో అక్రమ వ్యాపారులకు బాగానే కలిసివస్తోందనే విమర్శలు లేకపోలేదు.

కల్తీకి పాల్పడితే చర్యలు

తినుబండారాల విషయంలో ఎవరైనా కల్తీకి పాల్పడితే చర్యలు తీసుకుంటాం. అనుమతి లేకుండా దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లు తదితర వాటిని నిర్వహిస్తే చర్యలు తప్పవు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాల్సిందే. తనిఖీల సమయంలో శాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపుతాం. ల్యాబ్ నివేదిక రాగానే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. సిబ్బంది కొరత కొంత ఉంది.

- కూర్మనాయకులు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

ప్రభుత్వ విద్యార్థులకు ప్రోత్సాహక అవార్డులు

- రాష్ట్రస్థాయిలో టాప్‌టెన్ అవార్డులు
- ఉమ్మడి జిల్లాల్లో 24మందికి అవార్డులు
- అవార్డులు అందజేసిన మంత్రి డోలా వీరాంజనేయులు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 7(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో పది, సీనియర్ ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రోత్సాహక అవార్డులను అందజేసింది. పదవ తరగతి, సీనియర్ ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, గిరిజన విద్యార్థులకు బుధవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి చేతులమీదుగా అవార్డులు అందజేశారు. ఉమ్మడి కర్నూ లు, నంద్యాల జిల్లాల్లో అత్యధికంగా 24 మంది విద్యార్థులు ప్రోత్సాహక అవార్డులు కైవసం చేసుకున్నారు.

అవార్డులు పొందిన విద్యార్థులు

● ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాలు

ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ విద్యార్థులు రాష్ట్రంలోనే అత్యధికంగా 11 అవార్డులను కైవసం చేసుకున్నారు. పదవ తరగతిలో ఆళ్లగడ్డ ఆర్‌పీఆర్‌పీ పాఠశాలకు చెందిన కీర్తన 590 మార్కులతో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు సాధించింది. కర్నూలు దిన్నెదేవరపాడు పాఠశాలకు చెందిన ప్రమీల 587 మార్కులతో 4వ ర్యాంకు, ఆళ్లగడ్డ గురుకుల పాఠశాలకు చెందిన వర్షిత 585 మార్కులతో 6వ ర్యాంకర్‌గా, కర్నూలు వెల్దుర్తి పాఠశాలకు చెందిన దివ్య 584 మార్కులతో 7వ ర్యాంకర్‌గా నిలిచారు. అలాగే ఆళ్లగడ్డ ఆర్‌పీఆర్‌పీ పాఠశాలకు చెందిన సుధ 578 మార్కులు, ప్రియాంక 578 మార్కులుతో సిల్వర్ ర్యాంకర్‌గా నిలిచారు. సీనియర్ ఇంటర్‌లో పత్తికొండ గురుకులానికి చెందిన మల్లిక 983 మార్కులతో మూడో ర్యాంక్, లక్ష్మాపురం గురుకులానికి చెందిన ఆనందజ్యోతి 983 మార్కులతో మూడో ర్యాంక్ సాధించారు. అలాగే వెల్దుర్తి గురుకులం కళాశాల విద్యార్థిని అంకిత బైపీసీలో 980 మార్కులు, చిన్నటేకూరుకు గురుకులానికి చెందిన నాగకార్తీక్‌రెడ్డి ఎమ్పీసీలో 980, ఆదోని గురుకులానికి చెందిన వెన్నెల ఎమ్పీసీలో 980 మార్కులతో సిల్వర్ ర్యాంకులను సాధించి అవార్డులను కైవసం చేసుకున్నారు.

సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్

పదవ తరగతిలో నంద్యాల సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ హైస్కూల్‌కు చెందిన శశిరేఖ 587 మార్కులో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు సాధించారు. అలాగే జూపాడుబంగ్లా బాలికల పాఠశాలకు చెందిన హారిక 584 మార్కులతో 4వ ర్యాంక్, యర్రగుంట్ల బాలుర హాస్టల్‌కు చెందిన వినయ్ 579 మార్కులతో 8వ ర్యాంకు సాధించారు. సీనియర్ ఇంటర్‌లో కోవెలకుంట్ల బాలికల కళాశాలకు చెందిన సంకీర్తన 970 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించింది.

● ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల్లో: పదవ తరగతిలో పాణ్యం ట్రైబల్ ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇందు 570 మార్కులతో 4వ ర్యాంకు సాధించింది. ఆలూరు ట్రైబల్ వెల్ఫేర్‌కు చెందిన అంజలి 564 మార్కులు సాధించారు.

● ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్

ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ శ్రీశైలం పాఠశాలకు రేవంత్‌నాయక్ 590 మార్కులతో 1వ ర్యాంక్, రమావత్‌ఈశ్వర్‌నాయక్ 584 మార్కులతో 4వ ర్యాంక్, ఆళ్లగడ్డ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలకు చెందిన మహేశ్ నాయక్ 578 మార్కులతో 8వ ర్యాంక్ సాధించాడు. సీనియర్ ఇంటర్‌ల నెరవాడ కళాశాలకు చెందిన మనోజ్ఞబాయ్ 966 మార్కులు, ఫుల్లమ్మబాయ్ 966 మార్కులు సాధించి అవార్డులు కైవసం చేసుకున్నారు.



అవార్డులు పొందిన విద్యార్థులతో తల్లిదండ్రులు

కార్తీక్‌రెడ్డికి సర్టిఫికెట్ ప్రదానం

కర్నూలు ఎడ్యుకేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు డా.బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ-మెడికల్ అకాడమి విద్యార్థి కార్తీక్‌రెడ్డి ఇంటర్ పరీక్షల్లో 980మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. బుధవారం విజయవాడలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామి సర్టి ఫికెట్, జ్ఞాపిక, నగదు బహుమతి ఇచ్చి సత్కరించారు. కార్తీక్‌రెడ్డి జేఈఈ- అడ్వాన్స్‌డ్‌లో అ ర్హత సాధించారు. ఈ సందర్భం గా జిల్లా కోఆర్డినేటర్ ఐ.శ్రీదేవి, డా.ఉమామహేశ్వరప్ప, అధ్యాపకులు, విద్యార్థి, తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు.



విద్యార్థి కార్తీక్ రెడ్డికి సర్టిఫికెట్, జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి

అధికారిపై విచారణ పూర్తి


విచారణ చేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసీదేవి

కర్నూలు ఎడ్యుకేషన్, మే 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు సంక్షేమ భవన్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న విజయలక్ష్మీ దేవిపై వచ్చిన ఆరోపణలపైన ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విచారణ నిర్వహించారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విజయలక్ష్మీ దేవి అక్రమ మార్గాల్లో కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగం సంపాదిం చారని, భోగస్ సర్టిఫికెట్లతో పదోన్నతులు, నిధుల దుర్వినియోగం చేశారని ఆరోపణలు రావడంతో విచారణాధికారి ఆరా తీశారు. పిటిషనర్ అయిన మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్ వద్ద ఉన్న ఆధారాలను విచారణాధికారి ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీదేవి పరిశీలించారు. ఆధారాలను సేకరించి నివేదికలను తయారు చేసి రాష్ట్ర స్థాయి అధికారులకు పంపనున్నట్లు విచారణధికారి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ఒకరికి తీవ్ర గాయాలు
- ప్యాలకుర్తి సమీపంలో బైకులను ఢీకొట్టిన కారు


ప్రమాదానికి కారణమైన కారు ఇదే..

కోడుమూరు రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాలకుర్తి సమీపంలో కారు, బైకులను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలివీ.. ఆస్పరి మండలంలోని పలు కూరిబండ గ్రామానికి చెందిన గొల్ల వీరేష్ బైక్‌పై దేవరకు వెళ్తున్నాడు. అయితే ప్యాలకుర్తి సాయిబాబా గుడి సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. అదే వేగంలో కారు మరో బైక్‌ను ఢీకొట్టి రోడ్డు పక్కన పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో కారు టైరు పేలి ముందుభాగం దెబ్బతింది. ప్రమాదంలో ఓ బైక్ నుజ్జునుజ్జు కాగా, మరో బైక్ భాగాలు దెబ్బతిన్నాయి. వీరేష్ (35) అక్కడికక్కడే మృతి చెందడంతో పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరేష్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇంకో బైక్‌పై కర్నూలు వెళ్తున్న దినేష్ తీవ్రంగా గాయపడడంతో ఆసుపత్రికి తరలించారు. కారులో ఉన్నవారి వివరాలు తెలియరాలేదు. ఎస్ఐ ఎర్రిస్వామి కేసు దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ రైతు మృతి


భూషన్న (ఫైల్)

తుగ్గలి, మే 7(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నం చేసిన రైతు కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. వివరాలివీ.. మండలంలోని గిరిగిట్లకు చెందిన భూషన్న (63) తనకున్న రెండున్నర ఎకరాల పొలంతో పాటు మరో మూడెకరాలు కౌలు చేసుకుని వ్యవసాయం చేసేవారు. వేరుశనగ, కంది పంటలు సాగు చేశారు. పంటలు అప్పులే మిగి లిస్తుండటంతో అప్పులు ఎలా తీర్చాలోనన్న మనస్తాపంతో నాలుగు రోజుల క్రితం పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన పత్తికొండ వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ మృతి చెందారు. భూషన్న భార్య ఏడాది క్రితం చనిపోయింది. ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తుగ్గలి పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా పడి డ్రైవర్..

బేతంచెర్ల, మే 7 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి డ్రైవర్ దుర్మరణం పాలైన ఘటన మండలంలోని గూటుపల్లె-హుశేనాపురం గ్రామాల మధ్య చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గూటుపల్లెకు చెందిన చాకలి చంద్రుడు(42) తన ఆటోలో హుశేనాపురం గ్రామ సమీపంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన వేర్‌హౌస్‌కు సార్వక ట్లేలు తీసుకుని వెళ్లి తిరిగి గూటుపల్లెకు వస్తున్నాడు. ఒక జంతువు రోడ్డుకు అడ్డంగా రావంతో సుంకులమ్మ గుడి వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. చాకలి చంద్రుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్‌బాబు సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమ్మితం బనగానపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమార్తె ఉదయలక్ష్మి ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్


నిందితులతో డీఎస్పీ ప్రమోద్, సీఐ, ఎస్ఐ

ఆళ్లగడ్డ, మే 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని రుద్రవరం మండలం పెద్దకంబలూరులో ఈనెల 4వ తేదీన జరిగిన చెన్నూరు రమేష్ హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ కొలికేపూడి ప్రమోద్ తెలిపారు. బుధవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో నిందితులను అరెస్టుచేసి విలేకరులతో మాట్లాడారు. చెన్నూరుకి చెందిన రమేష్‌ను అదే గ్రామానికి చెందిన అశోక్ మరికొందరు కత్తితో గొంతుకోసి చంపారు. ఈ కేసుకు సంబంధించి అశోక్ , వెంకటపతి, తలారి మద్దులేటి అనే వ్యక్తులను బుధవారం ఉదయం చిన్నకంబలూరు సమీపంలోని కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద అరెస్టు చేశారు. హత్యాయుధాలు, ద్విచక్ర వాహనం, ఆటో, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పర్చడంతో మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు డీఎస్పీ వివరించారు. శిరివెళ్ల సీఐ దస్తగిరి బాబు, రుద్రవరం ఎస్ఐ వరప్రసాద్ పాల్గొన్నారు.

దామోదరం జిల్లాగా నామకరణం చేయాలి

- తెలంగాణ మాజీ ఎంపీ వి.హనుమంతరావు

కల్లూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): కర్నూలును మాజీ సీఎం, ఏఐసీసీ అధ్యక్షుడు దామోదరం సంజీవయ్య జిల్లాగా నామకరణం చేయాలని తెలంగాణ మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు, అద్దంకి దయాకర్ అన్నారు. బుధవారం దామోదరం సంజీవయ్య 53వ వర్ధంతిని పురస్కరించుకొని దామోదరం సంజీవయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముందుగా పెద్దపాడులోని ఆయన నివాస సముదాయంలో వారు దామోదరం సంజీవయ్య విగ్రహం, మ్యూజియాన్ని ప్రారంభించారు. ఆయన సేవలను వారు కొనియాడారు. దామోదరం సంజీవయ్య జీవితాన్ని బయోపిక్ (సినిమా) తీయాలని డిమాండ్ చేశారు. కర్నూలుకు ఆయన పేరుపెట్టే వరకు ఉద్యమాలకు సాగించాలని పిలుపునిచ్చారు. ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరికి ట్రస్టు తరుపున దామోదరం సంజీవయ్య పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ దామోదరం రాధాక్రిష్ణమూర్తి, వార్డ్ కమిటీ చైర్మన్ రామశేషయ్య, బహుజన విద్యావంతుల ఐక్యవేదిక అధ్యక్షుడు జెవి.క్రిష్ణయ్య పాల్గొన్నారు.

తలసేవ్‌మియా

- రక్త మార్పిడితోనే బతికే అవకాశం
- చిన్నారులను పట్టిపీడిస్తున్న తలసేమియా
- పేద కుటుంబాల్లో అధికశాతం బాధితులు
- నేడు వరల్డ్ తలసేమియా డే



కర్నూలు పెద్దాసుపత్రిలో తలసేమియా క్లినిక్

కర్నూలు హాస్పిటల్, మే 7 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు వచ్చే ప్రాణాంతక వ్యాధి తలసేమియా. బిడ్డ పుట్టిన నెలల వ్యవధిలోనే బయటపడే ఈ వ్యాధి వల్ల పిల్లల ఆరోగ్య పరిస్థితి దయనీయంగా మారుతోంది. కొందరికీ నెలకు మూడుసార్లు రక్తమార్పిడి చేస్తే గాని బతికే పరిస్థితి ఉండదు. పిల్లల భవిష్యత్తుపై వారి తల్లిదండ్రుల్లో మరింత ఆందోళన పెంచుతుంది. రోజువారి కూలీ పనులు చేసుకునే వారి కుటుంబాల్లో అధికంగా తలసేమియా బాధితులు ఉన్నారు. పిల్లల వైద్యంకోసం నెలకు కనీసం రూ.10వేలు ఖర్చు అవుతుంది. రక్తదాతల కోసం తిరగాల్సి వస్తోంది. ఈవ్యాధి బారినపడ్డ పిల్లలు చురుగ్గా ఉండలేకపోవడం, త్వరగా నీరసించడాన్ని తల్లిదండ్రులు తట్టుకోలేకపోతున్నారు. మిగతా పిల్లల్లా వయస్సుకు తగ్గట్టుగా కనపడకపోవడం కూడా తల్లిదండ్రులను మరింత కుంగుబాటుకు గురిచేస్తుంది. వరల్డ్ తలసేమియాడే సందర్భంగా ఈ ఏడాది డబ్ల్యూహెచ్‌వో తలసేమియా కోసం కలిసి సమాజాలను ఏకం చేయడం, రోగులకు ప్రాధాన్యత ఇవ్వాలన్న నినాదాన్ని ఇచ్చింది.



వారసత్వంగా ఎలా సంక్రమిస్తుందంటే...!

- తల్లిదండ్రుల్లో ఒకరు తలసేమియా క్యారియర్ కలిగి ఉంటే 50శాతం వారి పిల్లలు ఈ వ్యాధి క్యారియర్‌గా ఉంటారు.
- తల్లిదండ్రులిద్దరు తలసేమియా వ్యాధితో బాధపడుతుంటే.. వారి పిల్లలు వందశాతం వ్యాధిగ్రస్తులవుతారు.

చిన్నారులను రక్షించడానికి

- పెళ్లికి ముందు వధువు, వరుడు హెచ్‌బీఏ-2 పరీక్ష ద్వారా వ్యాధి రోగ నిర్ధారణ చేయించుకోవాలి.
- తలసేమియా వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే డాక్టరును సంప్రదించాలి.

ఎర్ర రక్తకణాలు క్షీణించడంతో



రక్తంలో ఎర్ర రక్తకణాలు క్షీణించడంతో తలసేమియా వ్యాధి సోకుతుంది. పుట్టినప్పటి నుంచి చిన్నారులకు ఈవ్యాధి వస్తుండటంతో వ్యాధిగ్రస్తులతో పాటు వారి కుటుంబ సభ్యులు నరకయాతన అనుభవిస్తున్నారు. క్రమం తప్పకుండా బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ (రక్తం ఎక్కించుకోవడం) జరిగితే తప్ప.. చిన్నారులు బతకలేని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. ఎంతో మంది పేద చిన్నారులు తలసేమియా వ్యాధితో బాధపడుతున్నారు. వీరందరికీ రక్తంతో పాటు ఆర్థిక అవసరాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. మానవతా దృక్పథంతో యువత ముందుకు వచ్చి తలసేమియా చిన్నారులను ఆదుకోవాల్సిన అవసరముంది.

ఉమ్మడి జిల్లాలో 600 మంది చిన్నారులు

ఉమ్మడి జిల్లాలో చిన్నారులు తలసేమియా వ్యాధితో సుమారు 600మంది చిన్నారులు బాధపడుతున్నారు. వీరందరికీ కర్నూలు జీజీహెచ్‌లోని చిన్నపిల్లల విభాగంలో తలసేమియా క్లినిక్‌ను ఏర్పాటుచేసి బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్, మందులను ఉచితంగా అందిస్తున్నారు. కర్నూలు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంకులో 140 మంది తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఉచితంగా రక్తం ఎక్కిస్తున్నారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రితో పాటు ప్రైవేటు బ్లడ్ బ్యాంకులో కూడా రక్తం ఎక్కిస్తున్నారు.

తలసేమియా క్లినిక్ ఏర్పాటు



కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని చిన్నపిల్లల విభాగంలో తలసేమియా క్లినిక్‌ను ఏర్పాటుచేసి సేవలు అందిస్తున్నారు. ప్రత్యేక వార్డులో రక్తం ఎక్కించడంతో పాటు మందులు, చికిత్సను అందిస్తున్నాం. జిల్లా బాలల సత్వర కేంద్రం (డైస్)లో చిన్నారులకు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. వరల్డ్ తలసేమియా డేను పురస్కరించుకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నాం. **- డా.బంగి విజయానందబాబు, వైస్ ప్రిన్సిపాల్, జీజీహెచ్, కర్నూలు**

రెడ్ క్రాస్ సొసైటీ చేయూత



ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 146 మంది చిన్నారులకు బ్లడ్ బ్యాంకులో ఉచితంగా రక్తమార్పిడి చేయిస్తున్నాం. బ్లడ్ బ్యాంకులో వచ్చే రక్తాన్ని 30 శాతం కర్నూలు జీజీహెచ్‌కు ఇస్తున్నాం. **- డా.కేజీ గోవిందరెడ్డి, చైర్మన్, రెడ్‌క్రాస్ సొసైటీ, కర్నూలు**

మేనరికం వివాహాల వల్ల..



మేనరికపు వివాహాల వల్ల, జన్యుపరమైన కారణాల వల్ల వచ్చే తలసేమియాను వస్తుంది. నూటికి 70 శాతం కేసులు తల్లిదండ్రులది మేనరికం వల్లే వస్తాయి. హిమోగ్లోబిన్ చిన్నారుల్లో తగ్గకుండా చూస కోవాలి. మేనరిక వివాహాలకు దూరంగా ఉంటే మంచిది. **- డా.కే.సింధూర రెడ్డి, చిన్న పిల్లల వైద్య నిపుణురాలు, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు**

ట్రాన్స్‌జెండర్‌తో ప్రేమాయణం!

- పెళ్లి చేసుకున్న యువకుడు
- ముఖం చాటేసి స్వగ్రామానికి
- భర్త ఇంటి ముందు అనూష నిరసన


అనూష గోపినాథ్ సెల్ఫీ (ఫైల్)

ఆదోని రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రాం ద్వారా ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమకు దారితీసింది. హైదరాబాద్‌కు చెందిన ట్రాన్స్‌జెండర్ అయిన అనూషను ఆదోని మండలంలోని సలకలకొండకు చెందిన గోపీనాథ్ ప్రేమాయణం సాగించాడు. పెద్దలను ఎదురించి పెళ్లి చేసుకొని హైదరాబాద్‌లో కొన్నాళ్ల పాటు కాపురం పెట్టాడు. చివరకు చెప్పా పెట్టకుండా గోపీనాథ్ స్వగ్రామానికి చేరుకున్నాడు. దీంతో భర్త కోసం ట్రాన్స్‌జెండర్ అనూష తన సహచర ట్రాన్స్‌జెండర్లతో కలిసి సలకలకొండకు వచ్చి రెండు రోజులుగా భర్త ఇంటి ముందు దీక్ష చేస్తోంది. దీంతో వీరి ప్రేమ కథ తాలుకా పోలీస్‌స్టేషన్‌కు చేరింది.

న్యాయం కోసం నిరసన

తాను న్యాయం కోసం నిరసన చేస్తున్నట్లు ట్రాన్స్‌జెండర్ అనూష తెలిపింది. నాలుగేళ్లగా మా ప్రేమాయణం సాగింది. గోపీనాథ్ బలవంతంతోనే ఏడాది క్రితం పెళ్లి చేసుకున్నాం. వారం రోజుల క్రితం నాకు చెప్పకుండా నా భర్త తన స్వగ్రామానికొచ్చాడు. ఈవిషయం తెలుసుకొని ఇక్కడికొచ్చాను.

అనైతిక సంబంధాలకు దూరంగా ఉండాలి

యువత అనైతిక సంబంధాలకు దూరంగా ఉండాలి. చెడుమార్గంలో కాకుండా సన్మార్గంలో నడవాలి. అనైతిక బంధాల ద్వారా అటు సమాజంలో, ఇటు కుటుంబంలో అవమానాలకు గురి కావాల్సి ఉంటుంది. ట్రాన్స్‌జెండర్ అనూష, గోపీనాథ్ ప్రేమ వ్యవహారంపై విచారణ చేపట్టాం. తదుపరి చర్యలు తీసుకుంటాం. **- సి.నల్లప్ప, రూరల్ సీఐ, ఆదోని**

కేంద్రీయ విద్యాలయం కోసం భవన పరిశీలన


పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

డోన్ రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): పట్టణం ప్రభుత్వ ఐటీఐలో కేంద్రీయ విద్యాలయం కోసం ఏర్పాటుచేసిన నూతన భవనాన్ని కర్నూలు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ప్రియదర్శిని బుధవారం సాయంత్రం పరిశీలించారు. డెస్కులు, వాషింగ్ మిషన్, ఆర్వో ప్లాంటు గదులను బాత్ రూములుచ మైదానాన్ని పరిశీలించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు భవనం అనుకూలంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట కేంద్రీయ విద్యాలయం పీజీటీ ఆంజనేయులు, డోన్ మండల విద్యాధికారి ప్రభాకర్ ఉన్నారు

పాక్‌కు గుణపాఠం చెప్పిన ప్రధాని మోదీ

- భారత సైనికుల రుణం తీర్చుకోలేనిది
- రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌కు భారత ప్రధాని నరేంద్రమోదీ తగిన గుణపాఠం చెప్పారని రాష్ట్ర రోడ్లు, భవ నాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కశ్మీర్‌లోని పహల్గాంలో అమాయకులైన హిందువులను పాకిస్తాన్ ఉగ్రవాదులు దుర్మార్గంగా పొట్టన బెట్టుకున్నారని బీసీ అన్నారు. దీనికి ప్రతిగా ప్రధాని మోదీ ఆపరేషన్ 'సిందూర్' పేరుతో పాక్ ఉగ్రవాద స్థావరాలపై భారత్ సైన్యం దాడులు నిర్వహించి 25 నిమిషాల్లో ఉగ్రవాదులను హతమార్చడం పహల్గాంలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళి అని బీసీ అన్నారు. మోదీ నాయకత్వంలో గొప్ప పోరా టంలో పాకిస్థాన్ ఉగ్రవాదులను మట్టుబెట్టిన భారత సైన్యానికి ఏమిచ్చినా రుణం తీర్చుకోలేని దన్నారు. ప్రతి భారతీయుడు భారతీ య సైన్యానికి మద్దతు ఇచ్చి భారతదేశం గొప్పదనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలన్నారు. ఇలాంటి సందర్భాలో ప్రతి భారతీయుడు ప్రధాని నరేంద్ర మోదీకి , భారత సైన్యానికి మద్దతు ఇవ్వాలన్నారు. పాకిస్థాన్ టెర్రరిజం జోలికి పోకుండా కఠిన చర్యలు తీసుకుంటున్న ప్రధానికి, సైన్యానికి మంత్రి అభినందనలు తెలిపారు.

వైద్య, డ్రగ్ కంట్రోల్ అధికారులపై చర్యలు

- మూడు వార్షిక ఇంక్రిమెంట్ల నిలిపివేత
- 2017లో కర్నూలు, ఆదోనిలోని నకిలీ వైద్యుల ఆస్పత్రులపై విజిలెన్స్ దాడులు
- డెకాయ్ ఆపరేషన్‌లో వెలుగులోకి వాస్తవాలు
- ఎనిమిదేళ్ల అనంతరం క్రమశిక్షణ చర్యలు



కర్నూలు, మే 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కర్నూలు, ఆదోనిలో నకిలీ వైద్యులు నిర్వహిస్తున్న ఆస్పత్రులపై 2017 జూన్‌లో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అభియోగాలు రుజువు కావడంతో ఆ సమయంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జీజీహెచ్) జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్, ఇద్దరు డ్రగ్ కంట్రోల్ అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. వీరికి మూడు వార్షిక గ్రేడ్ ఇంక్రిమెంట్స్ నిలిపివేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నకిలీ వైద్యులు నిర్వహిస్తున్న ఆస్పత్రులపై విజిలెన్స్ దాడులు అప్పట్లో కలకలం సృష్టించాయి.

కర్నూలు నగరంలో ఇలా..

నగరంలోని బళ్లారి చౌరస్తా సమీపంలోని చల్లావారి వీధిలో జేఆర్ చిల్డ్రన్ అండ్ సూపర్ హాస్పిటల్ స్థాపించి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. అలాగే ఆదోని పట్టణంలో విజయగౌరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ స్థాపించారు. ఈ రెండు ఆస్పత్రుల్లో అర్హత లేని వ్యక్తులు నకిలీ వైద్యులుగా అవతారమెత్తి రోగులకు చికిత్స అందిస్తున్నారని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు పక్కాగా సమాచారం వచ్చింది. దీంతో 2017 జూన్ 20న విజిలెన్స్ అధికారులు పక్కా ప్రణాళికతో డెకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. అందులో భాగంగా ఆసుపత్రికి రోగులుగా ఆస్పత్రికి వెళ్లి, పరిశీలించారు. పదో తరగతి కూడా చదవని వ్యక్తులు తమ పేర్ల ముందు డాక్టర్, చివరల్లో ఎండీ అని రాసుకున్నారని గుర్తించారు. ఆ వెంటనే మూకుమ్మడిగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అప్పటి విజిలెన్స్ ఎస్పీ శివకోటి బాబురావు, సీఐ జగన్మోహన్‌రెడ్డి, ఏవో వెంకటేశ్వర్లు తదితర విజిలెన్స్ అధికారులు కీలకంగా పని చేశారు.

ఆస్పతి నిర్వహకులపై చట్టపరమైన చర్యలకు ప్రభుత్వానికి పక్కా ఆధారాలతో నివేదిక ఇచ్చారు. అలాగే. ప్రైవేటు ఆసుపత్రి స్థాపించాలంటే ముందుగా ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ఇందుకు వైద్యులు బృందం, డ్రగ్స్ అధికారులు తనిఖీ చేసి ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఉన్నాయని నివేదిక ఇవ్వాలి. అయితే కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రి జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రంగనాథ్ ఆధ్వర్యంలోని బృందం ఆ ఆస్పత్రులను తనిఖీ చేసి నివేదిక ఇచ్చారు. అదే క్రమంలో కర్నూలు జిల్లా డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్, ఆదోనికి చెందిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కేఎస్ దాదా ఖలందర్‌లు కూడా ఆరోపణల ఎదుర్కొంటున్న ఈ ఆస్పత్రులకు అనుకూలంగా నివేదికలు ఇచ్చినట్లు తేలింది. దీంతో ఈ ముగ్గురితో పాటు 18 మందిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. అయితే తమపై వచ్చిన ఆరోపణలలో ఏమాత్రం నిజం లేదని, న్యాయం చేయాలని కోరుతూ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రంగనాథ్, డ్రగ్ కంట్రోల్ కర్నూలు ఏడీ ఎం.చంద్రశేఖర్, ఆదోని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కేఎస్ దాదా ఖలంద్‌లు వేరువేరుగా విన్నవించారు. వీరి విన్నపాలను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం ఇందుకు కమిషన్‌ను ఏర్పాటు చేసి విచారణ చేయించింది. అయితే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వీరిపై మోపిన అభియోగాలు నిజమేనని విచారణ కమిషన్ తేల్చింది. అక్రమాలు రుజువు కావడంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా పై ముగ్గురు అధికారులపై మూడు వార్షిక ఇంక్రిమంట్లు నిలుపుదల చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి మంజుల డి హోస్మని వేరువేరుగా ఉత్తర్వులు జారీ చేశారు.

కులాల మధ్య చిచ్చుపెట్టడం మంచిది కాదు

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు



ఉపకులపతితో మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు

కర్నూలు అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ క్యాంపస్‌లో కులాల మధ్య చిచ్చు పెట్టడం మంచి సంప్రదాయం కాదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆర్‌యూ ఉపకులపతిని ఆయన చాంబర్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జాతీయ బీసీ సంక్షేమం సంఘం అధ్యక్షుడు, డీసీఎంహెచ్ చైర్మన్ నాగేశ్వరరావు కలిశారు. ప్రొఫెసర్ ఎస్‌టీకే ఆగడాలకు అడ్డుకట్ట వేస్తారా.. లేక మంత్రి నారా లోకేశ్ వద్ద తెల్చుకోమంటారా అంటూ ఆయన ప్రశ్నించారు. కులాల మధ్య చిచ్చు పెట్టడం మంచి సంప్రదాయం కాదని, బీసీ ఉద్యోగిపై క్యాంపస్‌లో దాడి జరిగితే చర్యలు తీసుకోకుండా ఉన్నారంటూ ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ హక్కుల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నంరాజేశ్వరీ, బీసీ సంక్షేమం సంఘం రాష్ట్ర నాయకులు నక్కల మిట్ట శ్రీనివాసులు, టీడీపీ బీసీ రజక సంఘం రాష్ట్ర నాయకులు వెంపేంట రాంబాబు, నంది విజయలక్ష్మి, ఆర్‌వీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సీమకృష్ణ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వీవీ రమణ పాల్గొన్నారు.

'పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలి'



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ జనార్ధన్‌రెడ్డి

కర్నూలు కల్చరల్, మే 7(ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలని కీర్తి పవర్ సోలార్ ఏజెన్సీస్ అధినేత ఎస్. జనార్ధన్‌రెడ్డి అన్నారు. పీఎం సూర్యఘర్ పథకంపై కీర్తి పవర్ సోలార్ ఏజెన్సీస్ ఆధ్వర్యంలో నగరంలో పది రోజులపాటు శిక్షణలు ఉంటాయన్నారు. ఐటీఐ చదువుతున్న విద్యార్థులకు సోలార్ పథకం ద్వారా కలిగే లాభాలను తెలియజేశారు. బుధవారం ముగింపు సదస్సు లో ఎస్.జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటికి సోలార్ ఎలా బిగించు కోవాలి, సోలార్ పవర్‌ను ఎలా వినియోగం చేసుకోవాలి, అందువల్ల కలిగే లాభాలపై ఈ శిక్షణల్లో తెలియజేస్తారని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లకు సోలార్ పవర్‌ను వినియోగించుకోవడం వల్ల విద్యుత్ ఆదా చేసుకోవడంతోపాటూ బిల్లుల ఖర్చు తగ్గించుకునే వీలు ఉందన్నారు. కార్యక్రమంలో కర్నూలు, డోన్, నంద్యాల ప్రాంతాలకు చెందిన ఐటీఐ విద్యార్థులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామని ఆయన తెలిపారు.

'ఆపరేషన్ సిందూర్'పై ఎంపీ హర్షం

కర్నూలు అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గావ్ ఉగ్రదాడికి భారత్ ఆపరేషన్ సిందూర్ పేరుతో కౌంటర్ డాడి చేయడాన్ని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పాక్ పీవోకేలోని 9 ప్రాంతాల్లో భారత్ ఆర్మీ మెరుపు దాడులు చేయడంతో వంద మందికి పైగా ఉగ్రవాదులు మరణించారని, అందులో కీలక నేతలు హతమయ్యారన్నారు. పాక్‌పై భారత్ జరిపిన దాడి ప్రతి భారతీయుడు హర్షించదగ్గ విషయమన్నారు.

భారతీయ పౌరుడిగా గర్విస్తున్నా: జడ్పీ చైర్మన్

కర్నూలు న్యూసిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): భారత దేశం తమ త్రివిధ దళాలను ప్రణాళికాబద్ధంగా తగిన వ్యూహంతో తెల్లవారుజామున పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 9ఉగ్రవాద సంస్థల భవనాలను మట్టుపెట్టడం భారతీయ పౌరుడిగా గర్విస్తున్నామని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉగ్రవాద సంస్థల ఏరివేతకు కృషి చేసిన మన త్రివిధ దళాలకు జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియ జేస్తున్నామన్నారు.

ఒప్పందాన్ని ఉపసంహరించుకోవాలి

కర్నూలు న్యూసిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): సేకి ఒప్పందాన్ని ఉపసంహరిం చుకుని స్మార్ట్ మీటర్లను బిగించరాదని సీపీఎం నగర కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. బుధవారం రెండో వార్డు కల్లావీధిలో తక్షణమే కరెంటు చార్జీలను తగ్గించాలని కోరుతూ ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లను అతికించారు. రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలను నాటి ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సేకి ఒప్పందాన్ని చేసుకున్నారని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా దానినే కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శివర్గసభ్యులు ఎస్ఎండీ షరీఫ్, ఖాజాపాష, నూర్ అహ్మద్, రఫిక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, మే 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ ఈఈ శేషాద్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎన్‌ఆర్.పేట, సంకల్‌భాగ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

అనుమతి లేని క్లినిక్ సెంటర్లను సీజ్ చేయాలి

కర్నూలు హాస్పిటల్, మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారుల నుంచి ఎలాంటి అనుమతి లేకుండా లేజర్ చికిత్స నిర్వహిస్తున్న క్లినిక్‌లను సీజ్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో కే.అరుణకు వినతిపత్రం సమర్పించారు. కార్పొరేట్ సంస్థలు రంగు రంగుల ప్రకటనలతో మీ మొహం అందంగా మారుస్తామని, మంచి కలర్ తెప్పిస్తామంటూ ప్రజలను మోసం చేస్తూ వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు.

ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

కర్నూలు రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ డిమాండ్ చేశారు. కర్నూలు మండలం పంచలింగాల, ఈ.తాండ్రపాడు గ్రామంలో బుధవారం ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా నారాయణ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ కూలీల వేతనాలు చాలా మందికి రావడంలేదన్నారు. పని ప్రదేశంలో టెంట్లు, మెడికల్ కిట్లు, సరఫరా చేయాలన్నారు. ఈ.తాండ్రపాడు సర్పంచు బాలా పీరా, పంచలింగాల మాజీ సర్పంచు బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళి





అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పిస్తున్న జడ్పీ సీఈవో, అధికారులు, విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు న్యూసిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో నిర్వహించారు. బుధవారం జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఈఓ మాట్లాడుతూ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ కఠోరమైన దీక్షతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో అనూరాధ, పరిపాలన అధికారులు సరస్వతమ్మ, సి.మురళీమోహన్‌రెడ్డి, సి.రాంగోపాల్, జితేంద్ర, బసవశేఖర్, పుల్లయ్య, పుష్ప పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: పాత కంట్రోల్ రూమ్ సర్కిల్ వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి నిర్వహణ కమిటీ, విద్యార్థి ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిటీ అధ్యక్షులు రామశేషయ్య, ఏఐడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షులు వి.హరీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఓంకార్, రాఘవేంద్ర, సిండికేట్ బ్యాంకు సీఈవో ప్రభాకర్, రిటైర్డు అధ్యాపకుల జేవీవీ కృష్ణయ్య, ఖాదర్, మల్లేష్, శ్రీమన్నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

● స్థానిక బీ.క్యాంపు ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అడ్వకేట్ శశిధర్, తైక్వాండో కోచ్ సతీష్, అధ్యాపకులు రామకృష్ణ, విజయ శేఖర్, మల్లికార్జున, కృష్ణమోహన్, సోమేష్ పాల్గొన్నారు.

కర్నూలు క్రైం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఏఆర్ అడిషినల్ ఎస్పీ కృష్ణమోహన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర పోరాటంలో అల్లూరి సీతారామరాజు పాత్ర కీలక మైందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు జావేద్, నారాయణ, ఆర్ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి: ఏఐటీయూసీ



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప

కర్నూలు న్యూసిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. బుధవారం కార్యాలయంలో ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులతో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లేబర్ కోడ్లను రద్దు చేయాలని, 8 గంటల పనివిధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలనే డిమాండ్స్‌తో కేంద్ర కార్మిక సంఘాల తల పెట్టిన సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఐబీఈఏ జిల్లా కార్యదర్శి నాగరాజు, బీఎస్ఎన్ఎల్ నాయకులు రమణ, పోస్టల్ ఎం ప్లాయిస్ యూనియన్ నాయకులు ఈశ్వర్, లక్ష్మీకాంత్, అంగన్‌వాడీ వర్కర్స్ రాష్ట్ర నాయకురాలు జే.లలితమ్మ పాల్గొన్నారు.

● దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు అన్నారు. ఎన్ఆర్‌పేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్‌ను కలిసి సమ్మె నోటీసు అందజేశారు.

గూడూరు: ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్, ఆర్పీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి పిలుపునిచ్చారు. బుధవారం గూడూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో మెప్మా ఆర్పీలు సీఎంఎం ప్రమీలకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా జె.మోహన్, ప్రభావతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను సమూలంగా మార్చి వేసి కార్మికులకు ఉన్న సమ్మె హక్కును, ట్రేడ్ యూనియన్ హక్కులను మార్చివేసి బానిసలుగా మార్చి వేయాలని చూస్తుందన్నారు. ఈ కార్యక్ర మంలో మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం నాయకులు యశోధ, భారతి, పార్వతి, శాంతి, పద్మావతి పాల్గొన్నారు.

పూడిచెర్లలో మాక్ డ్రిల్



మాక్ డ్రిల్‌పై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో సందీప్ కుమార్

ఓర్వకల్లు, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిచెర్ల గ్రామంలో బుధవారం ఇండో-పాక్ ఉద్రిక్తతలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్డీవో సందీప్ కుమార్, కర్నూలు కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు, తహసీల్దార్లు విద్యాసాగర్, వెంకటలక్ష్మి, రమేష్‌బాబు, సీఐలు రామయ్యనాయుడు, మన్సూరుద్దీన్, ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్ హాజరయ్యారు. యుద్ధ పరిస్థితులు నెలకొంటే ఎలా ఉండాలనేదానిపై ప్రజలకు అవగాహన కల్పించారు. మాక్ డ్రిల్‌లో సైరన్లు మోగినప్పుడు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, గ్యాస్ ఆపివేసి ఇంట్లో నుంచి బయటకు రాకుండా ఉండాలని సూచించారు. ఈ సైరన్ మోగినప్పుడు ఆందోళనకు గురి కావద్దని, ఆల్ క్లియర్ అన్నప్పుడు మాత్రమే బయటకు రావాలని అధికారులు ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌డీఆర్ఎఫ్ ఆర్ఎస్ఐ మహేంద్ర నాయక్, ఎన్‌సీసీ దేవేంద్ర సింగ్, ఫారెస్టు డిపార్టుమెంటు బాలరాజు, మెడికల్ డిపార్టుమెంటు వెంకట ప్రవీణ్, మాలిక్, సుధాకర్, ఏపీఎస్‌డీసీఎల్ డీఈఈ నాగప్రసాద్, ఏపీఎస్ఆర్‌టీసీ సురేష్, 108 సిబ్బంది, గ్రామ నాయకులు పుల్లారెడ్డి, తిరుపాలు, ప్రకాశం, శివుడు, సూర రాజన్న, గ్రామస్థులు పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అధికారులు

ఉషా శిక్షణా తరగతులు ప్రారంభం



ఉషా శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న భూపతిరావు, కోచ్, మాస్టర్‌లు

కర్నూలు స్పోర్ట్స్, మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సహకారంతో పెద్దమార్కెట్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉషా వేసవి శిక్షణా శిబిరాన్ని బుధవారం జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు ప్రారంభించారు. అనంతరం ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రసంగించారు. చిన్నారులు శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి జి.శ్రీనివాసులు, ఉషా సంఘం కార్యదర్శి టి.శ్రీనివాసులు, తైక్వాండో మాస్టర్ వీరేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎస్ఐకి గాయాలు

కర్నూలు క్రైం, మే 7(ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో డోన్ జాతీయ రహదారిలో మిస్టర్ ఇడ్లీ హోటల్ సమీపంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ శ్రీనివాసులుకు గాయాలయ్యాయి. శ్రీనివాసులు సీఐడీలో ఎస్ఐగా పని చేస్తున్నారు. స్థానిక బాలాజీ విల్లాస్‌లో నివాసముంటున్న ఈయన బుధవారం ఉదయం తన కొడుకు, కూతురును బైక్‌పై ఎక్కించుకుని సిల్వర్‌జూబ్లీ కళాశాల దగ్గర ఉన్న మైదానానికి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా.. మిస్టర్ ఇడ్లీ హోటల్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. దొర్నిపాడు పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ కారును అతివేగంగా నడుపుకుంటూ ఎస్ఐ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఎస్ఐకి గాయాలు కాగా, కొడుకు, కూతురు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ కాలు విరిగిందని పోలీసులు తెలిపారు. లక్ష్మీనారాయణను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ శ్రీధర్ తెలిపారు.

కార్మికుల జీతాలు పెంచాలి

కర్నూలు న్యూసిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికుల జీతాలు పెంచాలని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం నగర పాలక కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మనోహర్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్నామన్నారు. సమస్యలను పరిష్కరించా లని కోరుతూ గత సంవత్సరం డిసెంబరు నెలలో నిరసనలు తెలిపిన కూడా సమస్యను పరిష్కరిస్తామని హామీ మాత్రమే ఇచ్చారని అన్నారు. ఇప్పటి వరకు వాటిని అమలు చేయలేదని అన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి సుమీర్ బాషా, రవూఫ్ బాషా, రంగ పాల్గొన్నారు.

దళితబాంధవుడు దామోదరం సంజీవయ్య

కర్నూలు అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): దళితబాంధవుడు దామోదరం సంజీవయ్య అని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రిగా, రెండు సార్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా అత్యున్నత పదవులు అలకంరించి దేశానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేంద్రనాయుడు, అనంతరత్నం మాదిగ, ఐన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న, బజారన్న, ఎస్ ప్రమీల, వెంకటసుజాత, లాజరస్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శి ఎస్.శరత్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఆర్‌యూలో పరిపాలన భవనం ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వర్శిటీలో నూతన కోర్సులు ప్రవేశపెట్టాలని, టీచింగ్ సిబ్బంది లేక నాణ్యమైన విద్య అందక, విద్యా ప్రమాణాలు దిగజారి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రాజీనామా చేసిన ఇంత వరకు కొత్త వారిని నియమించక పోవడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. నిరసనపై స్పందించిన రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు మాట్లాడుతూ సమస్యలు ఉన్న మాట వాస్తవమేనని, వాటిని పరిష్కరిస్తున్నామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అలీ, భరత్, ఈశ్వర్, మహేష్ పాల్గొన్నారు.

వైభవంగా దేవర

కోడుమూరు రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాలకుర్తిలో గ్రామదేవతలు మారెమ్మ, సుంకులమ్మ అమ్మవార్ల దేవర వైభవంగా జరిగింది. మహిళలు బోనాలతో వెళ్లి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, గాజులు, పూలు, సారె సమర్పిం చారు. దేవరను పురస్కరించుకుని గురువారం రాష్ట్ర స్థాయి బండలా గుడు పోటీలు నిర్వహించనున్నారు. పోటీలో వరుసగా 9 విజేత ఎద్దుల యజమానులకు దాతల సాయంతో నగదు బహుమతి ప్రకటించారు. మొదటి బహుమతి రూ. 50 వేలు అందిస్తున్నారు.

ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి: కమిషనర్



రాజకీయ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు నియోజకవర్గానికి సంబంధించి ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు కోరారు. బుధవారం నగర పాలక కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొత్త ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు తొలగింపునకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చిందన్నారు. ఎవరైనా చిరు నామా, పోలింగ్ బూత్ మార్పు, చనిపోయిన వ్యక్తుల ఓటరు తొలగింపునకు స్థానిక బీఎల్ఓను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ తహసీల్దారు ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి: ఎమ్మెల్యే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఓర్వకల్లు, మే 7(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాలు రాణించాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ఓర్వకల్లులోని పొదుపులక్ష్మి మండల ఐక్యసంఘం ఆధ్వర్యంలో మండల సమాఖ్య గౌరవ సలహాదారులు విజయభారతి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత బ్యూటీషియన్, మగ్గం కోర్సులను ఎమ్మెల్యే ప్రారంభించి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం శిక్షణా పరికరాలను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రామచంద్రుడు, పుల్లారెడ్డి, ప్రకాశం, శివన్న, సూర రాజన్న, విజయుడు పాల్గొన్నారు.

కౌలు కార్డులు అందజేయాలి: ఏవో

సి.బెళగల్, మే 7(ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు కార్డులు అందజేయాల్సిన బాధ్యత వీఆర్వోలదేనని మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ అన్నారు. బుధవారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఆయా గ్రామాల వీర్వోలు, ఎంపీఈవోలతో సమావేశం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ పొలం కౌలు ఇచ్చే రైతులకు భూయజమానులు తప్పనిసరి పొలం కౌలుకు ఇచ్చినట్లు అగ్రిమెంట్ తప్పకుండా రాసి ఇవ్వాలన్నారు. ఈసమావేశంలో తహసీల్దార్ పురుషోత్తం పాల్గొన్నారు.

పండ్లతోటల సాగుపై దృష్టి పెట్టాలి: ఏపీవో

సి.బెళగల్, మే 7(ఆంధ్రజ్యోతి): పండ్లతోటల సాగుపై దృష్టి పెట్టాలని ఏపీవో రామన్న అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది గ్రామాల్లోని సన్నకారు రైతులను గుర్తించి పండ్లతోటలు సాగు చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. ఐదు ఎకరాల లోపు ఉన్న సన్న కారు రైతులకు ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందన్నారు. ఈసమావేశంలో ఈసీ రంగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు ఎడ్యుకేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో ముందస్తు అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకో వాలని ఎస్ఎస్ఏ, డీఎస్ఎఫ్, పీఎస్ఏ, ఆర్ఎస్ఎఫ్ నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారులను కోరారు. బుధవారం సీ.క్యాంపు సెంటర్‌లో కరపత్రాలు, ఫ్లెక్సీలు దహనం చేసి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు శివప్రసాద్‌గౌడ, పీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు రాజు, డీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉదయ్, ఆర్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మహేష్, విద్యార్థి సంఘాల నాయకులు రవి, సురేష్, ప్రవీణ్, రాజేష్ పాల్గొన్నారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ సతీమణి రాజ్యలక్ష్మి

కర్నూలు కల్చరల్, మే 7(ఆంధ్రజ్యోతి): పాత నగరంలోని పూజబజార్ సమీపంలోని కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో వాసవీ మాత జయంతి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ సతీమణి రాజ్యలక్ష్మి హాజరై కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా టీజీ రాజ్యలక్ష్మిని ఆలయ కమిటీ మహిళా ప్రతిని ధులు శాలువతో సత్కరించారు. చిన్న అమ్మవారిశాల ఆలయ కమిటీ అధ్యక్షుడు జూటూరు గోపాలయ్య, ఉపాధ్యక్షుడు విఠల్‌శెట్టి, ఆలయ కమిటీ ప్రతినిధులు శేషగిరిశెట్టి, రవి, జవహర్‌బాబు, హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

నిమిషాంబాదేవికి..: పాతనగరంలోని చిత్తారి వీధిలో వెలసిన నిమిషాం బాదేవి ఆలయంలో బుధవారం అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు గణపతి పూజ, అమ్మవారికి అభిషేకం, మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు సీపీ వెంకటేశ్ వర్మ పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

కోడుమూరు రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులకుర్తిలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో అభిషేకాలు, ఆకుపూజ, పుష్పార్చన నిర్వహించారు. మధ్యాహ్నం పురోహితులు వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణం వైభవంగా జరిపించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను వాహనంపై కొలువుంచి మేళతాళాల మధ్య వీధుల గుండా ఊరేగించారు. వర్కూరులో జాయ భీమిరెడ్డి వంశీకులు అభిషేకం, కల్యాణం, అన్నదానం నిర్వహించారు.

కర్నూలు ఎడ్యుకేషన్: వీరబ్రహ్మేంద్రస్వామి సామాజిక తత్వవేత్త అని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ ఆంధ్రప్ర దేశ్, వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం కమిటీ సభ్యులు దేవపూజ ధనుంజయాచారి అన్నారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు పురస్కరించుకుని ఉద్యోగనగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

గూడూరు: గూడూరు మండలం పెంచికలపాడు గ్రామంలో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధనోత్సవాలు నిర్వహించారు. బుధవారం స్వామి వారి ఆలయంలో బ్రహ్మంగారి ఆరాధన, కల్యాణం నిర్వహించారు. భక్తులు స్వామి వారికి దర్శించుకున్నారు.



పులకుర్తిలో ఊరేగింపు నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణులు

ఉగ్రవాదుల అంతం ఎంతో అవసరం

ఆదోని టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌లో ఉగ్రవాదంపై దాడులు చేయడమంటే ప్రపంచమంతా ఉగ్రవాదానికి స్థానం లేకుండా చేయడమేనని మైనార్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి ఎ.నూర్ అహ్మద్ అన్నారు. బుధవారం మాట్లాడుతూ పహల్గాంలో ఉగ్రవాద దాడులకు బలి అయిన కుటుంబాలకు న్యాయం చేసేందుకు భారత సైన్యం రంగంలోకి దిగడం అభినందించదగ్గ విషయం అన్నారు. ఉగ్రవాద శిబిరాలు, క్యాంపును భూస్థాపితం చేసేందుకు కంకణం కట్టుకున్న సైనికులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం అభినందనీయమన్నారు.


ఎ.నూర్ అహ్మద్

సార్వత్రిక సమ్మెకు సహకరించండి


అసిస్టెంట్ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు అధికారులు సహకరించాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు గోపాల్, కార్యదర్శి తిప్పన, ఐఎఫ్‌టీయూ కార్యదర్శి వెంకప్ప, ఏఐటీయూసీ అధ్యక్షుడు భీమేష్ కోరారు. బుధవారం మునిసిపల్ కార్యాలయంలో సహాయ కమిషనర్ డాక్టర్ అనుపకు సమ్మె నోటీసులు అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాను నీరుగారిస్తున్నాయని ఆరోపించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని కోరారు. 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. పారిశ్య, ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటారన్నారు.

వాసవీ మాత జయంతి


గంగ నీరు తీసుకువస్తున్న మహిళలు

మద్దికెర, మే 7 (ఆంధ్రజ్యోతి): నగరేశ్వరస్వామి ఆలయంలో వాసవీ మాత జయంతి నిర్వహించారు. బుధవారం మహిళలు మద్దమ్మ బావికి వెళ్లి గంగ పూజ అనంతరం కలశాలతో నీరు తెచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం పూజలు, భజన నిర్వహించారు. సుంకు రవీంద్ర, మెడికల్ వీరేష్, కృష్ణమోహన్ గుప్త, ముత్యాల రాజశేఖర్, కాశీ విశ్వనాథ్, రమా తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

హాలహర్వి, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో వరలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని విరుపాపురం గ్రామంలో మొక్కలు నాటారు. మొక్కలు నాటడాన్ని బాధ్యతగా తీసుకోవాలని, మొక్కలతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. రైతులు పండ్ల తోటలు పెంచేందుకు ఆసక్తి చూపాలన్నారు. ఆలయాల్లోనూ, ప్రభుత్వ స్థలాల్లోనూ మొక్కలు నాటలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోకా సిద్ధమ్మ, కార్యదర్శి మంజునాథ్, మల్లికార్జున, ఏపీవో చక్రవర్తి పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఎంపీడీవో

రజక సంక్షేమ కమిటీలు ఏర్పాటు చేయండి

ఆదోని టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): రజక సంక్షేమ కమిటీలను ఏర్పాటు చేసి, సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి కోరారు. బుధవారం ప్రకాశం జిల్లా కలెక్టర్ తమిం అన్సారీని కలిసి విన్నవించారు. జీవో నెంబర్ 27 ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రులు, పోలీసు శిక్షణా కేంద్రాల్లో ధోబీ పోస్టులను రజకులతో భర్తీ చేయాలని కోరామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను లాండ్రీ షాపులకు అందేలా చూడాలన్నారు. స్పందించిన కలెక్టర్ చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు సావిత్రి తెలిపారు.


కలెక్టర్‌ను కలిసిన సావిత్రి

ఉద్యోగికి సన్మానం

ఆదోని రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): మండల కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తూ, ఎంపీడీవోగా పదోన్నతి పొందిన శేఖర్‌ను బుధవారం ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్, తహసీల్దార్ శివరాముడు సన్మానించారు. ఎంపీపీ భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జనార్ధన్, సీనియర్ సహాయకులు వీరభద్రప్ప, సిబ్బంది పాల్గొన్నారు.


ఉద్యోగిని సన్మానిస్తున్న తహసీల్దార్

బాల్య వివాహాలు నేరం


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మద్దికెర, మే 7 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం ఆరోగ్య కేంద్రాల్లో కిషోరి వికాసం నిర్వహించారు. బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. చిన్న వయసులోనే ఆడపిల్లలకు పెళ్లి చేసి వారి బంగారు భవిష్యత్తును నాశానం చేయొద్దన్నారు. అమ్మాయికి 18 ఏళ్ల దాటాకే వివాహం చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నిరంజన్ బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా ఉన్నారు.

పత్తాలేని వీఆర్వోలు

- ఇబ్బంది పడుతున్న రైతులు


దేవనకొండ తహసీల్దార్ కార్యాలయం

దేవనకొండ, మే 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ అధికారులు గ్రామాల్లో రైతులు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆదేశిస్తున్నా అవి క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. దేవనకొండలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు ఎవరూ అందుబాటులో ఉండడం లేదని రైతులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. తమ పనుల నిమిత్తం రైతులు, ప్రజలు చెప్పులరిగేలా తిరుగుతున్నా పనులు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్టిఫికెట్లు, ఆన్‌లైన్‌లో పేరు మార్పు కోసం రోజుల తరబడి తిరుగుతున్నా పనులు కావడంత లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పనులు కావాలంటే చేయి తడపాల్సిందేనని ప్రజలు ఆరోపిస్తున్నారు.



ఆరు నెలలుగా తిరుగుతున్నా

దేవనకొండ రెవెన్యూ సర్వే నెం.700-1లో అన్నదముల భాగంలో నాకు 3.25 ఎకరాలు రావాలి. గత అధికారుల తప్పిదంతో పాసు పుస్తకంలో 1.90 ఎకరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదైంది. సరిచేయాలని ఆరు నెలలుగా తిరుగుతున్నా. అపుడు, ఇప్పుడంటూ తిప్పుతున్నారు. తిరగ లేక ఇబ్బందులు పడుతున్నా. అధికారులు స్పందించాలి. **- రామాంజినేయులు, బైరవానికుంట**

నిర్లక్ష్యం చేస్తే చర్యలు

రైతులను నిర్లక్ష్యం చేసే వీఆర్వోలపై పిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. అవినీతికి పాడితే చర్యలు తప్పవు. **- ప్రసాదురాజు, తహసీల్దార్**

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జొన్నగిరిలో అధికారులు, పోలీసుల మాక్‌డ్రిల్


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్ఐ

తుగ్గలి, మే 7 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యాటకులను హతమార్చిన పాకిస్థాన్ ఉగ్రవాదులకు బుద్ధి చెప్పేందుకు దేశం సిద్ధంగా ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో విశ్వమోహన్, ఎస్ఐ మల్లికార్జున సూచంచారు. బుధవారం మండలంలోని జొన్నగిరి గ్రామ కూడలి వద్ద ప్రజలకు మాక్‌డ్రిల్ నిర్వహించారు. దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం ఉందని, ఏమి జరిగినా ప్రజలందరూ ధైర్యంగా ఉండాలని, కొత్త వ్యక్తులు, అపరిచితులపై నిఘా ఉంచి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సర్పంచ్ ఓబులేసు, డీటీ నాగరాజు, జియో మైసూరు కంపెనీ మేనేజర్ సోమిరెడ్డి రామ్మోహన్, ఆర్ఐ వెంకట్రాముడు, వీఆర్వో కాశీ, పంచాయతీ కార్యదర్శి నారాయణ స్వామి, రఘు ఉన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేశభక్తి

- కమాండర్ కల్నల్ అలోక్ త్రిరుపాతి


ఎన్‌సీసీ విద్యార్థులతో గ్రూప్ కమాండర్ అలోక్ త్రిరుపాతి

ఆదోని అగ్రికల్చర్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి అలవడుతుందని కర్నూలు ఎన్‌సీసీ హెడ్ క్వార్టర్ గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాటి అన్నారు. బుధవారం ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ ట్రూప్‌ను ఆయన సందర్శించారు. ఎన్‌సీసీ దేశంలోనే అతిపెద్ద యూనిఫామ్ సంస్థ అన్నారు. పాఠశాలలు, కళాశాలు, యూనివర్సిటీల్లో విద్యార్థులకు సైనిక శిక్షణ, న్యాయకత్వ లక్షణాలు, సామాజిక సేవ చేసే అవకాశం ఉందన్నారు. ఎన్‌సీసీలో శిక్షణ పొందిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో, జాతీయ స్థాయి ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా ద్వారా ఉద్యోగాలు పొందవచ్చని సూచించారు. కమాండింగ్ ఆఫీసర్స్ జోసెఫ్ ఫిలిప్, ప్రిన్సిపాల్ మురళీమోహన్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బాలస్వామి, అధ్యాపకులు అయ్యప్ప యుగంధర్ రెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్లు గోవిందు, ఈరమ్మ పాల్గొన్నారు.

కార్మికులకు చట్టాలపై అవగాహన ఉండాలి

- న్యాయాధికారి జోత్స్నదేవి


మాట్లాడుతున్న న్యాయాధికారి జోత్స్నదేవి

పత్తికొండ టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు చట్టాలపై అవగాహన ఉండాలని పత్తికొండ జూనియర్ సివిల్ న్యాయాధికారి టి.జోత్స్నదేవి అన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కార్మిక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయాధికారి మాట్లాడుతూ ప్రతి కార్మికుడు 8 గంటలు మాత్రమే పని చేయాలని, ప్రమాదంలో నష్టం వాటిల్లినప్పుడు పరిహారం పొందవచ్చునన్నారు. పంచాయతీ ఈవో నరసింహులు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మధుబాబు, న్యాయవాదులు సురాజ్‌నబీ, నగేష్,గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పహల్గాం దాడికి ప్రతీకారమే 'సిందూర్'


ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీజేపీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలు

తుగ్గలి, మే 7 (ఆంధ్రజ్యోతి): పర్యాటకులపై దాడి చేసిన ఉగ్రవాదులపై ప్రతీకారంగానే ప్రధాని మోదీ 'ఆపరేషన్ సిందూర్'ను చేశారని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు మండలంలోని రాంపల్లెకు చెందిన వైసీపీ నుంచి 20 కుటుంబాలు బీజేపీలో చేరాయి. గ్రామ నాయకుడు రంగయ్య ఆధ్వర్యంలో పెద్ద రంగన్న, సంజీవరెడ్డి, శివశంకర్ ఆచారితో పాటు 20 కుటుంబాల వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా వేసి బీజేపీలోకి ఆహ్వానించారు. బీజేపీ నాయకులు బ్రహ్మయ్య, గోవర్ధన్, తుగ్గలి నరేష్, లక్ష్మణస్వామి, ఓబులేసు, రవిరెడ్డి పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినికి రాష్ట్రస్థాయి అవార్డు


విజయవాడలో అవార్డు అందుకుంటున్న విద్యార్థినులు

పత్తికొండ, మే 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో 983 మార్కులు సాధించిన మల్లికను ప్రభుత్వం సన్మానించింది. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంపిక చేయగా పత్తికొండ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన మల్లిక ఎంపీసీ విభాగంలో గురుకుల విభాగంలో మూడో స్థానంలో అవార్డుకు ఎంపికైంది. బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంత్రి బాలవీరాంజనేయులు అవార్డుతోపాటు రూ.10వేలను మల్లిక అందుకుంది. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి, విద్యార్థిని వెంట ఉన్నారు.

లక్ష్మీనారాయణ కుటుంబానికి రక్షణ కల్పించాలి : మాజీ మంత్రి మారెప్ప

ఆలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): హత్యకు గురైన ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని మాజీ మంత్రి మూలింటి మారెప్ప డిమాండ్ చేశారు. బుధవారం ఆలూరులో విలేకరులతో మాట్లాడారు. ఫ్యాక్షన్ హత్యలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షల ఆర్థిక సాయం అందించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. హత్యకు సూత్రధారులను గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై సీఎం చంద్ర బాబు, హోంశాఖ మంత్రికి విన్నవిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు తిరుపాల్ ఉన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి మారెప్ప

అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ తప్పనిసరి

మద్దికెర, మే 7 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం ఇవ్వనున్న అన్నదాత సుఖీభవ పథకానికి ఈకేవైసీ తప్పనిసరని ఏవో రవి అన్నారు. బుధవారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. సర్పంచ్ బురుజుల విజయుడు, తదితరులు ఉన్నారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

ఆదోని అగ్రికల్చర్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 30% మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్టీయూ పురపాలక కమిటీ సభ్యుడు రమేష్ నాయుడు బుధవారం ఆయన ఓ ప్రకటనలో కోరారు. 12వ పీఆర్‌సీ చైర్మన్‌ను ఏర్పాటు చేయకపోవడంతో ఉద్యోగులు నిరాశ చెందుతున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు.

'సిందూర్' హర్షణీయం

ఆలూరు, మే7(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఉగ్రవాదులపై ఇండియన్ ఆర్మీ 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమవడం కావడం హర్షణీయమని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. బుధవారం ఆలూరులో మాట్లాడుతూ పాకిస్థాన్‌కు ముచ్చెమటలు పట్టించిన ఆర్మీకి అభినందనలు తెలిపారు.

రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోండి

ఆదోని రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ శివరాముడు బుధవారం తెలిపారు. నూతన రేషన్‌కార్డు కావాలనుకున్న వారు దరఖాస్తు, ఆధార్ కార్డు తీసుకొని సచివాలయాల్లో సంప్రదించాలని సూచించారు. రేషన్ కార్డు బదిలీ, నూతన సభ్యుల చేర్పు, చిరునామా మార్పుకు అవకాశం ఉందన్నారు.

ఎంపీడీవోతో టీడీపీ నాయకుల వాగ్వాదం

మద్దికెర, మే 7 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాటు టీడీపీ కోసం కష్టపడిన కార్యకర్తలకు బీసీ రాయితీ రుణాలు ఇవ్వకుండా వైసీపీ కార్యకర్తలకు అమ్మేసుకున్నారని ఆ పార్టీ నాయకులు ఎంపీడీవోతో వాగ్వావాదానికి దిగారు. బుధవారం ఎంపీడీవో లబ్ధిదారుల జాబితా ప్రకటించడంతో తమ పార్టీ మద్దతుదారుల పేర్లు లేవని మాజీ జడ్పీటీసీ సభ్యుడు రాజన్న యాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజులు, విద్యా కమిటీ చైర్మన్ చంద్ర, ఎంపీడీవో కొండయ్యతో వాగ్వావాదానికి దిగారు. అనంతరం ఎమ్మెల్యే శ్యాంబాబుకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఎంపీడీవో కొండయ్య మాట్లాడుతూతా తాము ఎవరి వద్ద డబ్బు తీసుకోలేదని, అర్హులనే ఎంపిక చేశామని వివరణ ఇచ్చారు.

మాట తప్పిన చంద్రబాబు : ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంచనని చెప్పిన చంద్రబాబు మాట తప్పారని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో విలేక రుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక మరోసారి చార్జీలు పెంచి సామాన్య ప్రజలపై భారం మోపారన్నారు. నాటి సీఎం జగన్‌మోహన్ రెడ్డి సెకీ కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందంతో పోలిస్తే రూ.2.11 కోట్లు అదనం అన్నారు. ఈ లెక్కన ఏడాదికి రూ.440 కోట్లు నష్టమన్నారు. రాష్ట్ర ప్రజలు ఇదంతా గమనిస్తూనే ఉన్నారన్నారు. గత ప్రభుత్వంలో రూ.1,100 కోట్లు జగన్ ఖాతాలోకి వెళ్లాయని టీడీపీ నాయకులు ఆరోపించి, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక టీడీపీ ప్రభుత్వం చేస్తున్నది ఏమిటని ప్రశ్నించారు. అమరావతిపై పెట్టే ఖర్చు రాష్ట్రానికి వెచ్చిస్తే రోడ్లు బాగు పడతాయన్నారు. ధణాపురం-హొళగుంద రహ దారి అధ్వానంగా ఉందని, గత వైసీపీ ప్రభు త్వంలో టెండర్లు వేస్తే దాన్ని రద్దుచేశారని, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల తరఫున వైసీపీ పోరాటాలకు సిద్ధంగా ఉందన్నారు. తక్షణమే విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కన్వీనర్ మల్లికార్జున, నాయకులు అరికెర వెంకటేశ్వర్లు, భాస్కర్, వీరేష్, నాగేంద్ర, ఎల్లప్ప, రాజశేఖర్, వరుణ్, కురువ దానాల రాజు పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన

ఆదోని, మే 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నల్లగేటు వద్ద రైల్వే గేట్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే పార్థసారథి, రైల్వే అసిస్టెంట్ ఇంజనీర్ సిరాజ్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్ కృష్ణ, తహసీల్దార్ శివరాముడుతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఇక్కడ వంతెన నిర్మించాలని రైతులు, హమాలీలు, కూలీలు, బసాపురం గ్రామస్థులు ఎన్నికల సందర్భంలో విన్నవించారు. వారికి ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు.


మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, రైల్వే అధికారులు

వైద్యుల చీటి లేకుండా మందులు ఇవ్వకండి

- సీఐ శ్రీరాములు, ఈగల్ టీం ఎస్ఐ సుజన్ కుమార్


యజమానులతో మాట్లాడుతున్న సీఐ శ్రీరామ్

ఆదోని, మే 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపుల యజమానులు మందులు ఇవ్వడం నేరమని, వన్ టౌన్ సీఐ శ్రీరాములు, ఈగల్ టీం ఎస్ఐ సుజన్ కుమార్ హెచ్చరంచారు. బుధవారం ఈగల్ ఐజీ ఆర్‌కె రవికృష్ణ ఆదేశాల మేరకు ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్‌కు సంబంధించి ఆదోని సబ్ డివిజన్‌లోని మెడికల్ షాప్ యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈగల్ టీం ఎస్ఐ సుజన్ కుమార్ మాట్లాడుతూ, ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్ అంటే నార్కోటిక్ సైకోట్రోఫిక్ ఔషధాలని వాటిని డాక్టర్ స్పెషల్ ప్రిస్క్రిప్షన్‌పై మాత్రమే రోగులకు విక్రయించాలని సూచించారు. వైద్యుడి సలహా లేకుండా వాడితే ప్రమాదమని, చాలామంది అనారోగ్యాలకు గురవుతారన్నారు. ప్రిస్క్రిప్షన్ డాక్టర్ పేరు, ఎంసీఏ నెంబర్ ఉండాలని, అలా లేకుండా విక్రయిస్తే డ్రగ్స్ అండ్ కాస్మోటిక్ యాక్ట్ ప్రకారం దుకాణదారుని లైసెన్స్ రద్దుతో పాటు జరిమానా విధిస్తామన్నారు. ఈగల్ టీం హెడ్ కానిస్టేబుల్ ఎలీషా, మాసుం వలి, మెడికల్ అసోసియేషన్ సభ్యులు మరియాల శ్రీధర్, రియాజ్, ప్రసాద్ తెలిపారు.

ఘనంగా వాసవి జయంతి

ఆదోని టౌన్/ ఆదోని, మే 7 (ఆంధ్రజ్యోతి): వాసవి మాత్ర జయంతి సందర్భంగా బుధవారం స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు సంకల్ప వ్రతంతో పాటు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. మాడ వీదులలో అమ్మవారి పల్లకి సేవ నిర్వహించారు. నూతన జంటలు వాసవి మాతను దర్శించుకొని పూజలలో పాల్గొన్నారు. అనంతరం రాత్రి వాసవి మాత శోభయాత్ర వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు వీటీ ప్రకాష్, అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి వేణు, ఉపాధ్యక్షుడు టీజీ రామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగాయి.


పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

ఘనంగా తిరునాళ్లు

వెల్దుర్తి, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో బుధవారం వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల నిర్వహించారు. గ్రామపెద్దలు విజయమోహన్‌రెడ్డి, ఎంపీపీ దేశాయి లక్ష్మీదేవి, మాజీ జడ్పీటీసీ సమీర్‌కుమార్‌రెడ్డి వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు చేశారు. సాయంత్రం పల్లకిసేవ, రాత్రి భజన, నందికోలసేవ నిర్వహించారు.

జలకాలాటలలో...



ఉక్కపోత, ఎండ వేడిమి నుంచి ఉపశమనానికి చిన్నారులు, ప్రజలు బావులలో ఈత కొడుతున్నారు. బుధవారం మద్దికెరలో శేషిరెడ్డి బావిలో సేద తీరుతున్నారు. వేసవి సెలవులు కావడంతో కొందరు ఈత నేర్చుకోవడానికి మరికొందరు మంది ఈత కొట్టడానికి బావుల వద్దకు వెళ్తున్నారు. అయితే పెద్దలు దగ్గర ఉండి కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే క్షేమం. - మద్దికెర,

వైభవంగా ప్రహ్లాదరాయల పల్లకోత్సవం



పల్లకిలో ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, మే 7(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య ప్రహ్లాదరాయల పల్లకోత్సవం వైభవంగా నిర్వహించారు. బుధవారం వైశాఖ దశమి శుభసందర్భాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ప్రహ్లాదరాయలకు పాదపూజ, విశేషాభిషేకాలు నిర్వహించి వివిధ రథాలపై ఊరేగించారు. అనంతరం పల్లకిలో ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ రామాంజులు, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ వేణుగోపాల్ రాజు, మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తదితరులు పాల్గొన్నారు.

పీఠాధిపతికి డ్రై ఫ్రూట్స్‌తో తులాభారం



పీఠాధిపతికి తులాభారం చేస్తున్న కర్ణాటక ఎమ్మెల్సీ రామకృష్ణ

మంత్రాలయం, మే 7(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులకు కర్ణాటకలోని మాండ్య ఎమ్మెల్సీ రామకృష్ణ, వారి కుటుంబ సభ్యులు తులాభారం చేశారు. బుధవారం మఠం ప్రాంగణంలో తులాభారంలో ఒక వైపు పీఠాధిపతిని కూర్చోబెట్టి, మరోవైపు డ్రై ఫ్రూట్స్, కందిపప్పు, బియ్యం పదార్థాలను పెట్టి తులాభారం చేశారు. అనంతరం తులాభారం చేసిన ఎమ్మెల్సీ రామకృష్ణ, వారి కుటుంబ సభ్యులకు పీఠాధిపతి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషీ, సురేష్ కోనాపూర్, ద్వారపాలక అనంత స్వామి, శ్రీపతాచార్, డోస్ రాఘవేంద్రాచార్, పవనాచార్‌లు పాల్గొన్నారు.

'రాళ్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

ఎమ్మిగనూరు రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): రైతుల పంటలకు సాగునీరు అందించేందుకు ఎల్లెల్సీ కాలువ కింద నిర్మించిన ఎంఎల్ఎస్పీ కాలువకు ఇరువైపులా ఉన్న రాళ్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న డిమాండ్ చేశారు. బుధవారం ఎమ్మిగనూరులోని ఎల్లెల్సీ డీఈ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోనెగండ్ల మండలంలోని అల్వాల గ్రామంలో ఉన్న ఎంఎ ల్ఎస్పీ కాలువ నుంచి రైతులకు ఎల్లెల్సీ అధికారులు నీటిని సరఫరా చేస్తున్నారన్నారు. లక్షల రుపాయలు వెచ్చించి ఎంఎల్ఎస్పీ కాలువకు ఇరువైపులా రాళ్లతో బెడ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే కాలువకు ఇరువైపులా బెడ్‌కు ఉన్న రాళ్లను అల్వాల గ్రామానికి చెందిన రాజారెడ్డి తన సొంత పనుల కోసం కూలీలను పెట్టి మరి రాళ్లను పెకలించుకెళ్లడం జరిగిందన్నారు. దీంతో కాలువకు ఇరువైపులా ఉన్న బెడ్‌కాస్త పెద్దదై నీరు సక్రమంగా ప్రవహించడానికి వీలులేకుండా పోయిందన్నారు. తక్షణమే ఎల్లెల్సీ అధికారులు స్పందించి కాలువబెడ్‌కు ఉన్న రాళ్లను తీసుకెళ్లిన వారిపై చర్యలు తీసుకెళ్లాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాల రాజు, బాబు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యంపై ఎక్సైజ్ దాడులు

కోసిగి, మే 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.హనుమంతరావు ఆదేశాల మేరకు కర్ణాటక బార్డర్ కలిగినటువంటి కోసిగి, ఎమ్మిగనూరు, ఆదోని ఆలూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కర్ణాటక మద్యంపై క్రాస్ చెక్ దాడులు బుధవారం నిర్వహించినట్లు కోసిగి ఎక్సైజ్‌సీఐ భార్గవ్‌రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో మాలపల్లి గ్రామంలో బోడబండ శివ అనే వ్యక్తి దగ్గర 40 డిప్స్ ఆఫ్ ఒరిజినల్ చాయిస్ టెట్రా ప్యాకెట్లు, పెసలబండ గ్రామంలో మద్దిలేటమ్మ అనే మహిళ వద్ద 20డిప్స్ ఒరిజినల్ చాయిస్ టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకుని రెండు కేసులు నమోదు చేశామన్నారు. కర్ణాటక మద్యం అక్రమ నిల్వలు, అక్రమ అమ్మకాలు, రవాణాపై దాడులను విస్తృతం చేసి కర్ణాటక మద్యం నివారణకు పటిష్ట చర్యలు తీసుకున్నట్లు కోసిగి సీఐ భార్గవ్‌రెడ్డి తెలిపారు.

కుట్టుమిషన్ శిక్షణ ముసుగులో దోపిడీ

ఎమ్మిగనూరు టౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): కుట్టు మిషన్ శిక్షణ ముసుగులో రాష్ట్ర ప్రభుత్వం దోపిడీకి పాల్పడిందని వైసీపీ నాయకులు ఆరోపించారు. బుధవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆపార్టీ రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరుపాక్షిరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు మురళినాయుడు, చేనేత అధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడారు. మునిసిపల్ వైస్ చైర్మన్ నజీర్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులపై ప్రిన్సిపాల్ అసభ్య ప్రవర్తన

● ఆందోళనకు దిగిన విద్యార్థి సంఘాల నాయకులు
● రాజీనామా చేసిన ప్రిన్సిపాల్

ఎమ్మిగనూరు, మే 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ కార్పొరేట్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడన్న ఆరోపణలతో విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు బుధవారం కళాశాలలో ఆందోళనకు దిగారు. కుర్చీలను పగలగొట్టారు. ప్రిన్సిపాల్‌తో వాగ్వాదానికి దిగారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ఎలా ప్రవర్తిస్తారని నిలదీశారు. వాగ్వాదం తీవ్రతరం కావటంతో కళాశాల డీన్, ఇతర సిబ్బంది కార్యాలయంలోకి వచ్చి నాయకులతో మాట్లాడారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రిన్సిపాల్ రాజీనామా పత్రాన్ని రాసిచ్చారు. దీంతో విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు శాంతించారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ ఉదయ్, బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య శేఖర్, ఆర్పీఎస్ఎఫ్ షాహిద్ అఫ్రిది, ఆర్‌యూఎస్ఎఫ్ రఘు, యాంటీకరప్షన్ నాయకురాలు వసుందరాదేవి, ఇస్మాయిల్, ఎంపీజే ఖదీర్, అతుకుల్, కలాం, ఇమ్రాన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడివెళ్ల గ్రామంలో ఎస్సీల శ్మశాన వాటిక స్థలాన్ని కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకులు ప్రసాద్, ఏపీ ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ రవి డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎస్సీలకు శ్మశానం కోసం కేటాయించిన స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏకలవ్య, ఇసాక్, యాకోబు, సునీల్, జయన్న తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయంలో మాక్ డ్రిల్

మంత్రాలయం, మే 7(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర సర్కిల్‌లో బుధవారం సాయంత్రం రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ యంత్రాలతో మాక్ డ్రిల్ నిర్వహించారు. యుద్ధం జరిగితే ఎలా ఉండాలనే దానిపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. మాక్ డ్రిల్‌లో సైరన్లు మోగినప్పుడు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, గ్యాస్ ఆపివేసి ఇంట్లో నుంచి బయటకు రాకుండా ఉండాలని సూచించారు. సైరన్ మోగినప్పుడు ఆందోళనకు గురి కావద్దని, ఆల్ క్లియర్ అన్నప్పుడు మాత్రమే బయటకు రావాలన్నారు. ఈమాక్ డ్రిల్‌లో తహసీల్దార్ రవి, ఆర్ఐ ఆదాం, సీఐ రామాంజులు, మాధవరం, మంత్రాలయం ఎస్ఐలు విజయకుమార్, శివాంజల్, హెడ్ కానిస్టేబుల్స్ లక్ష్మీనా రాయణ, సర్వేయర్ హరి, వీఆర్వో భీముడు, భీమన్నగౌడు, ప్రభాకర్, అగ్నిమాపక అధికారులు పాల్గొన్నారు.



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక అధికారులు

'ఆపరేషన్ సిందూర్' విజయవంతంపై సంబరాలు

ఎమ్మిగనూరు, మే 7(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతంపై పట్టణంలోని 21 వార్డులో ప్రజలు సంబరాలు జరుపుకున్నారు. బుధవారం వార్డు కౌన్సిలర్ దయాసాగర్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ దయాసాగర్ మాట్లాడుతూ ఉగ్రస్థావరాలపై భారత సైన్యం విజయవంతంగా దాడి చేసిందన్నారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు రాజశేఖర్, అనిల్, లోకేష్, మహేష్, గడ్డం రవి, నారాయణ, పద్మావతి, రంగనాథ్, శ్యామ్, హుసేని, టింకు, వీరేష్‌లు పాల్గొన్నారు.



కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న వార్డు ప్రజలు

రైతులకు న్యాయం చేస్తాం

సబ్ కలెక్టర్ భరద్వాజ్



రీ సర్వే రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

నందవరం, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు భూ రీసర్వే ద్వారా న్యాయం చేస్తామని ఆదోని సబ్ కలెక్టర్ భరద్వాజ్ అన్నారు. మండలంలోని ముగతి గ్రామంలో బుధవారం తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ప్రతి రైతుకు ముందుగానే నోటీసులు జారీ చేయడంతో అధిక సంఖ్యలో పొలాల రీసర్వే కోసం రైతులు వచ్చారు. అలాగే ఇబ్బందులు ఉన్న రీ సర్వే పొలాల రికార్డులను సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఎవరికి ఇబ్బంది లేకుండా చూస్తానని రైతులకు భరోసా కల్పించారు. రైతుల సరిహద్దుల వరకు చూపించారు. ఇంకా ఎవరైనా పొలాల దగ్గర ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ మహేష్, తాలుకా సర్వేయర్ శ్రీనివాసరాజు మండల సర్వేయర్‌అక్బర్‌బాషా, శేఖర్, వీఆర్వో రాఘవేంద్ర, రైతులు పాల్గొన్నారు.

దేవర ఉత్సవాల్లో ఎమ్మెల్యే బీవీ



నాగలదిన్నెలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలదిన్నె, కనకవీడు గ్రామాల్లో దేవర ఉత్సవాల్లో బుధవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు. నాగలదిన్నెలో ఊరి దేవర సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మొదట ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేను సన్మానించారు. అలాగే కనకవీడు గ్రామంలో పెద్దమ్మవ్వ, మారెమ్మవ్వకు ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులు తీసుకున్నారు. దేవర ఉత్సవాలకు ఎమ్మెల్యే బీవీ రావడంతో దేవరకు వచ్చిన భక్తులు ఒక్కసారిగా ఎమ్మెల్యేను కలసేందుకు ఎగబడ్డారు. ఎమ్మెల్యే అమ్మవార్లకు ప్రత్యే పూజలు చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. క్లస్టర్ ఇన్‌చార్జు కాశీంవలి, సోమలగూడదు వెంకట్రామిరెడ్డి, ఈరన్న, జబ్బార్, ఎన్ఏ వహబ్, తిమ్మప్ప, సుదీర్, కిశోర్, వీరేష్ పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కును స్వాగతిస్తున్నాం



మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం నాయకుడు ఏసేపు

ఎమ్మిగనూరు టౌన్, మే 7(ఆంధ్రజ్యోతి) : బనవాసి దగ్గర మెగా టెక్స్టైల్ పార్కు ఏర్పాటును స్వాగతిస్తున్నామని రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఏసేపు, ఐఎఫ్‌టీయు జిల్లా నాయకులు అనిఫ్ అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మెగా టెక్స్టైల్ పార్కు కేవలం భూమి పూజ కార్యక్రమంకే పరిమితి కాకుండా త్వరగా నిర్మాణం పూర్తిచేయాలని కోరారు. మెగా టెక్స్‌టైల్ పార్క్ రావడంతో ప్రజలకు ఉపాధి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో జయన్న, తిక్కన్న, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ శ్మశాన వాటిక ఏర్పాటుచేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బండేగురుస్వామి

నందవరం, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలచింత గ్రామానికి హిందూ శ్మశాన వాటికను కేటాయించాలని టీడీపీ నాయకులు బండేగురుస్వామి కోరారు. బుధవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ శ్మశాన వాటిక లేక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్పందించిన తహసీల్దార్ నెలలోపు గ్రామానికి శ్మశానవాటిక కోసం స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

ఈరన్న మృతి పార్టీకి తీరనిలోటు : టీడీపీ




ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టసోమపురానికి చెందిన టీడీపీ నాయకులు ఈరన్న మృతి పార్టీకి తీరని లోటని మాజీ సర్పంచ్ లింగన్న, ఎంపీటీసీ వీరేష్, భాస్కర్ అన్నారు. ఈరన్న నాగులాపురం నుంచి బుధవారం గ్రామానికి తిరిగి ఆటోలో వస్తుండగా ప్రమదశాత్తు ఆటోలో నుంచి కిందకి జారిపడగా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈరన్న లాంటి వ్యక్తి మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుడి కుటుంబానికి పార్టీ, తాను అండగా ఉంటామన్నారు. బాధిత కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయం టీడీపీ నాయకులు అందజేశారు.

రహదారులు నిర్మానుష్యం

గోనెగండ్ల, మే 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎండలు మండుతున్నాయి. మధ్యాహ్నం 12గంటలు దాటితే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. జనం ఆరు బయటకు రావడం మానేశారు. ఎండ తీవ్రత 40డిగ్రీలు దాటి పోతోంది. కూల్‌డ్రింక్స్, చెరుకురసం దుకాణాల దగ్గర మాత్రం జనం రద్దీ కనిపిస్తోంది. ఈ నెల చివరికి ఎండ తీవ్రత ఎంత ఉంటుందో అని జనం ఆందోళన చెందుతున్నారు.



గోనెగండ్లలో ఒంటి గంట సమయంలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి



వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ వైద్యురాలు రంగరవళి అన్నారు. వేసవిలో ప్రజలు ఆరోగ్యసూత్రాలను తప్పక పాటించాలన్నారు. ప్రస్తుతం 39 డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయన్నారు. వేడి వడగాలుల కారణంగా వడదెబ్బ తగిలే అవకాశాలు ఉన్నాయన్నారు. పని చేసే వారు ఉదయం 6 గంటల నుంచి 11 గంటల లోపు పనులు పూర్తి చేసుకోవాలని కోరారు. స్థానిక ఆరోగ్య కేంద్రాలలు, ఆరోగ్య ఉపకేంద్రాలలో ప్రజల కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచామన్నారు.

\- రంగారవళి, ప్రభుత్వ వైద్యురాలు

గోశాలకు పశుగ్రాసం వితరణ



కర్ణాటక నుంచి ట్రాక్టర్లతో తెచ్చిన పశుగ్రాసం

మంత్రాలయం, మే 7 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణ కేంద్రానికి కర్ణాటకలోని గంగావతికి చెందిన రైతులు ఐదు ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని అందజే శారు. బుధవారం నాలుగు ట్రాక్టర్లు, ఒక లారీ పశుగ్రాసాన్ని మధ్వమార్గ కారిడార్‌లో ఉంచి రాఘవేంద్రస్వామిని దర్శించుకుని గోశాలకు అప్పగించారు. రైతులను మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషీ, సురేష్ కోనాపూర్, గోశాల సూపర్‌వైజర్లు దేశాయ్ రాఘవేంద్రలు మెమెంటో, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇప్పించి ఆశీర్వదించారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు



వీరబ్రహ్మేంద్ర స్వామికి పూజలు చేస్తున్నఅర్చకులు

ఎమ్మిగనూరు టౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మంత్రాలయం రోడ్డులో వెలసిన వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో భక్తులు బుధవారం ఉదయం రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ స్థాపకులు రామకృష్ణస్వామి, డీజే రవి, పద్మనాభ అచారి తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల కేంద్రంలో వీరబ్రహ్మేంద్ర స్వామి 332వ ఆరాధనోత్సవం ఘనం నిర్వహించారు. పంచామృతాభిషేకం, కుంమఅర్చన, మహామంగళహరతి పూజలు నిర్వహించారు. అనంతరం గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రహ్మనులు, భక్తులు పాల్గొన్నారు.

కోసిగి మండలానికి 82,603 నోటు పుస్తకాలు



నోటు పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో-2 శోభారాణి

కోసిగి, మే 7(ఆంధ్రజ్యోతి): మండలానికి 82,603 నోటు పుస్తకాలు చేరినట్లు ఎంఈవో-2 శోభారాణి తెలిపారు. బుధవారం ఈ పుస్తకాలు మండలానికి చేరుకోగా వాటిని బాలుర ఉన్నత పాఠశాలలో భద్రపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైట్ నోటు పుస్తకాలు 33,036, గీతల పుస్తకాలు 36,993లు, హిందీ పుస్తకాలు 8,266, మ్యాథ్స్ గ్రాఫ్ పుస్తకాలు 4,309 మొత్తం 82,603 పుస్తకాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ బడులు తెరిచిన వెంటనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతోపాటు నోటుపుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు అందజేస్తామన్నారు.

గర్భిణులకు టీకాలు వేయించాలి

జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి రఘు



గర్భిణులకు సూచనలిస్తున్న రఘు

గోనెగండ్ల, మే 7(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, చిన్నారులకు అంటువ్యాధులు సోకకుండా ఉండేందుకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సచివాలయంలో గర్భిణులకు, చిన్న పిల్లలకు వేసే టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాలు వేయించడం వల్ల భవిష్యత్‌లో ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడకుండా రక్షణ కల్పిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణ అధికారి హనుమంతు, ఆరోగ్యకార్యకర్తలు ప్రవీల కుమారి, ఆశా వర్కర్లు అమీనా, మైమూన్, ఖలీల్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: పట్టణంలోని ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని సంచార చికిత్సా కార్యక్రమం నోడల్ అధికారి డాక్టర్ రఘు బుధవారం తనిఖీ చేశారు. లక్ష్మీపేట ఆరోగ్య కేంద్రం పరిధిలో చిన్నారికి టీకాను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతాశిశుమరణాలను సమర్థవంతంగా నివారించాలంటే గర్భిణుల వివరాలు వారికి ఉన్న ఆరోగ్య ఇబ్బందులు, ప్రస్తుతం అందుతున్న వైద్యం, ముున్ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి వివరాలను మాతాశిశు సంరక్షణ కార్డులో నమోదు చేయాలన్నారు. ఎంసీపీ కార్డులో మొదటినెల గర్భం దాల్చినప్పటి నుంచి కాన్పు అయ్యో వరకు ఆరోగ్య పరిస్థితులు, ప్రసవం అయ్యాక శిశువు ఆరోగ్యంగా ఎదగటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఉంటాయన్నారు. దీన్ని పరిశీలించి వైద్యులు ప్రతినెల వారికి చికిత్సలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి విజయ కృష్ణ, సిబ్బంది దేవమణి, ఆశాకార్యకర్తలు, ఖలీల్ పాల్గొన్నారు.

ఈ-పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

ఐదెకరాల స్థలాన్ని సిద్ధం చేసిన శ్రీమఠం అధికారులు



మంత్రాలయంలో ఈ-పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన స్థలం

మంత్రాలయం, మే 7(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరగడంతో పాటు మితిమీరిన ట్రాఫిక్‌తో ప్రజలు, భక్తులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఇందుకు పోలీసు శాఖ, ట్రాఫిక్ నియంత్రణ చేసినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఎమ్మిగనూరు రోడ్డులోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఐదెకరాల స్థలాన్ని దాదాపు రూ.65 లక్షల ఖర్చుతో ప్రహరీ నిర్మించి ఈ-పార్కింగ్‌కు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది. ఇందుకు త్వరలో నాంది పలకనున్నారు.



ముఖద్వారం వద్ద అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్